జనరాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 3 సంచిక - 5 | పక్షపత్రిక | మార్చి 1-15, 2012



## జేపీ రైతు సత్యాగ్రహ యాత్ర

## ప్రభుత్వ ఆంక్షలను ధిక్కరిస్తాం

# రైతులకు అమ్ముకునే స్వేచ్ఛను సాధిస్తాం

# రైతు సత్యాగ్రహ యాత్ర దృశ్యాలు

















జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక మార్చి 1-15, 2012

సంపుటి - 3 సంచిక - 5

## లోపలి పేజీల్లో...

రాష్ట్రంలో ఉప ఎన్నికలు .................... 5
ఉపఎన్నికల బరిలో లోక్‌సత్తా పార్టీ...... 6
ఆంక్షలను తుంగలో కలిపి.................... 8
అమ్ముకునే స్వేచ్ఛ కోసం రైతు పాదయాత్ర....... 11
అంతం కాదిది ఆరంభం....................... 12
రైతు కోసం సంకెళ్ళకు సిద్ధం................ 15
రైతు క్షేమం పట్టని సర్కార్.................... 16
స్పెక్ట్రమ్ సర్వజనుల సొత్తే.................... 18
రైతును నిరాశ పరిచిన రాష్ట్రబడ్జెట్....... 20
బడ్జెట్ బలుపు కాదు వాపే!................... 24
రైల్వేల అభివృద్ధికి 5.6 లక్షల కోట్లు....... 25
కుల నాయకుల్ని చేయొద్దు................ 27
ప్రజాస్వామ్యం దిశగా మయన్మార్........ 29
శ్రీ వరిసాగుకే ఉపాధి సయం.............. 30
లోక్‌సత్తా పార్టీ కార్యక్రమాలు.............. 31

## సంపాదకవర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

డి.వి.వి.యస్. వర్మ
సంపాదకులు

సంపాదక వర్గం

జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి
డి.టి.పి : జ్యోతి తాటి
ఫోటోలు : ఎన్. సంజీవ్ కుమార్

# మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు?

## సంపాదకీయం

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు సిద్ధం అయినప్పుడు, వాయిదా వెయ్యడానికి వీలు లేకుండా సర్వోన్నత న్యాయస్థానం తీర్పు చెప్పినప్పుడు, మాత్రమే జరిగే పరిస్థితి కనిపిస్తున్నది.

ఫిబ్రవరి 29న రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం 2011 జనాభా లెక్కలలో యస్.టి.యస్.సి. గణాంకాలు వెలువడిన తర్వాత నాలుగు నెలలలోగా ఎన్నికలు జరగాలి. రాష్ట్ర ప్రభుత్వ వాదన ప్రకారం మార్చి 31వ తేదీకి ఈ గణాంకాలు అందుతాయి. అంటే జూలైలోగా ఎన్నికలు జరగాలి. జరుగుతాయా? మళ్లీ కోర్టుకెక్కితే నెలల గడిచిపోయే అవకాశం ఇంకా మిగిలే వుంది.

ముందుగా స్థానిక ప్రభుత్వాల ఎన్నికల పట్ల రాష్ట్ర ప్రభుత్వాలకి చిత్తశుద్ధిలేదు. కాని ఎన్నికలు సకాలంలో జరిపించాల్సిన బాధ్యత రాష్ట్ర ఎన్నికల కమీషన్ మీద వుంది. అలా జరిపించడానికి రాష్ట్ర ప్రభుత్వాలు అడ్డుపడితే తనే కోర్టు జోక్యాన్ని కోరాల్సివుంది. గతంలో ఎన్నికల కమీషన్ అదే పని చేసింది. ఇప్పుడు రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఎన్నికలకు మేం సిద్ధం అని చెప్పడం తప్ప జరగకపోతే తదనంతర బాధ్యతలు తీసుకునే చొరవను చూపించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. ఈ ఎన్నికల కమీషన్ రాష్ట్ర ప్రభుత్వాల అవసరాలకు తగ్గట్టు వ్యవహరించాల్సిన అవసరం లేకపోయినా అలాగే వ్యవహరిస్తున్నది.

జనాభా లెక్కలు అందిన తర్వాత ఎన్నికలు జరపాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు సమర్థనీయంగా కనిపించడం లేదు. 73,74 సవరణల అనంతరం రాజ్యాంగం ప్రకారం గడువు ముగిసేలోగా స్థానిక ప్రభుత్వాలకు ఎన్నికలు జరిగి తీరాలి. దీనిలో ఎలాంటి మినహాయింపులను రాజ్యాంగం కల్పించలేదు. గతంలో హైకోర్టు ఈ విషయాన్ని స్పష్టం చేస్తూ గడువులోగా ఎన్నికలు జరపాలన్నది రాజ్యాంగం ఆదేశంగా పేర్కొన్నది. సూచన మాత్రం కాదని తేల్చి చెప్పింది. దీనిని సుప్రీం కోర్టు పలు సందర్భాలలో స్పష్టం చేసింది. అంతకు మించి గడువు తర్వాత స్పెషల్ ఆఫీసర్ల నియామాకాలకు లేదా పదవీ కాలం ముగిసిన ప్రజా ప్రతినిధుల కొనసాగింపుకు ఎలాంటి వీలు కల్పించడం లేదని స్పష్టం చేసింది. అందువల్ల ప్రభుత్వం ఏదో సాకుతో స్పెషలాఫీసర్ల పాలన సాగించడం రాజ్యాంగ విరుద్ధం తప్ప వేరుకాదు.

పోతే సుప్రీం కోర్టు 1997 తీర్పులో ఎన్నికలు సకాలంలో జరిగి తీరాల్సిందేనని స్పష్టం చేస్తూ రాష్ట్రంలో ఎన్నికలు జరపడానికి వీలులేని అసాధారణ పరిస్థితులు వున్నప్పుడు తప్ప వీలు లేదని స్పష్టం చేస్తూ దానికి వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి భీభత్సాలను ఉదాహరణగా పేర్కొంది.

ఈ నేపధ్యంలో జనాభా లెక్కల కోసం ఎన్నికల వాయిదాకు అనుమతించడం సబబుగా కనిపించడం లేదు. అనాటికి అందుబాటులో వున్నా లెక్కల ఆధారంగానే ఎన్నికలు జరిపితీరాలి. లేకపోతే భవిష్యత్తులో ఎలాంటి చిల్లర కారణాలతో ఎన్నికల వాయిదాకు రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధం అవుతాయో ప్రజాస్వామ్యంలో ఎన్నికైన ప్రజాప్రతినిధులు లేకుండా పాలన సాగించే పద్ధతి సమర్థనీయం కాదు. ■




# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
8-2-674బి/2/9, ప్లాట్ నం : 93
హ్యాపీ వ్యాలి, రోడ్ నం. 13ఎ,
బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034

**ఫోన్ నంబర్లు :**
**040-23311817, 23311819,**
**23311820, 23312829**
**ఫ్యాక్స్ : 040-23310612**
accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311817**
సెల్ : *80085 07934*

విడి ప్రతి : రు. *10* ,
ఏడాది చందా : రు. *200*
మూడేళ్ళ చందా : రు. *500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# రాష్ట్రంలో ఉప ఎన్నికలు

మార్చి 18న రాష్ట్రంలో 7 నియోజక వర్గాలలో ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో 4 స్థానాలు – ఆదిలాబాద్ కామారెడ్డి, నాగర్‌కర్నూల్, కొవూరు స్థానాలు గతంలో తెలుగుదేశం పార్టీ గెలుచుకుంది. వీరు ఇప్పుడు పార్టీని విడిచిపెట్టి తెరాసలో, వై.యస్.ఆర్.కాంగ్రెస్‌లో చేరారు. ఒక్క నాగం జనార్ధన్ రెడ్డి మాత్రం ఏ పార్టీలోనూ చేరకుండా వున్నారు. స్టేషన్ ఘన్‌పూర్, కొల్హాపూర్ స్థానాలు గతంలో కాంగ్రెస్ గెలిచింది. వీరు పార్టీని ఫిరాయించి తెరాసలో చేరారు. మహబూబ్‌నగర్ నుండి గెలిచిన ఇండిపెండెంటు మరణంతో అక్కడ ఉపఎన్నిక జరుగుతుంది.

ఇప్పుడు తెలంగాణా ప్రాంతంలో వున్న ఆస్థానాలలో తెరాస ఎన్ని స్థానాలు గెలుచుకున్నా అది దానికి అదనపు బలం అవుతుంది. తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలు తమ స్థానాలు దక్కించుకో లేకపోతే ఆ మేరకు నష్టపోతాయి. ఈ ఉప ఎన్నికల్లో మొత్తం మీద పరిస్థితి తెరాసకు మెరుగుగానూ, తెలుగుదేశానికి ఎక్కువ నష్టంగానూ కనిపిస్తున్నది.

గత ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ మహా కూటమిని ఏర్పాటు చేసింది. అందులో తెరాస, సి.పి.ఐ, సి.పి.యం పార్టీలు భాగంగా వున్నాయి. ఇప్పుడు పరిస్థితి తెలుగుదేశానికి వ్యతిరేకంగా రూపొందింది. ఆ పార్టీకి తెరాసతో పాటు సి.పి.ఐ, సి.పి.ఐ(యం)లుకూడా దూరం అయ్యాయి. సి.పి.ఐ(యం) తన అభ్యర్థుల్ని పోటీకి నిలబెట్టి తెలుగుదేశానికి కోత పెడుతుంటే సి.పి.ఐ. తాను తెరాసతో జట్టుకట్టి తెలుగుదేశాన్ని ఒంటరిని చేసింది.

ఈ పరిస్థితులలో తెలుగుదేశానికి ఈ ఉపెన్నికలు విషమ పరీక్ష కానున్నాయి. రాబోయే ఎన్నికలలో తమని ఏకపక్షంగా ప్రజల ఎన్నుకోబోతున్నారని చంద్రబాబు ప్రతినిత్యం చేసే ప్రకటనలు బండారం కాస్త బైట పడనుంది. ఈ ఎన్నికల్లో గెలుపు ఓటమిలు తెలుగుదేశం పార్టీ 2014 భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసేవికానున్నాయి.

ఇక పోతే కాంగ్రెస్ పార్టీకి అటు తెలంగాణాలో ఇటు కోస్తాలో విజయవకాశాలను ఈ ఎన్నికలు తేల్చనున్నాయి. వై.యస్.ఆర్. కాంగ్రెస్ మనుగడను ఈ ఉప ఎన్నిక ప్రభావితం చేస్తుంది. అందుచేత ఇవి ఉప ఎన్నికలే అయినా, శాసనసభలో అధికార సమీకరణాలు మారకపోయినా తెలుదేశం, కాంగ్రెస్, వై.యస్.ఆర్. కాంగ్రెస్‌ల పట్ల ప్రజలు ఇచ్చే తీర్పు ఆ పార్టీలపైనా, భవిష్యత్తు ఎన్నికలపైనా ప్రభావాన్ని చూపుతుంది.

### తె.దే.పాకు దూరంగా వామ పక్షాలు

ఈ ఎన్నికల్లో వామపక్షాలు గతంలోని పొత్తులను తిరగరాస్తున్నట్లు కనిపిస్తున్నది. అవి రెండూ భిన్నకారణాలతో తెలుగుదేశం పార్టీకి దూరంగా వుండాలని నిర్ణయించుకున్నాయి. ఈ ఉప ఎన్నికలు తెలంగాణా ప్రాంతంలో హెచ్చుగా వున్నందున ఇక్కడ తెలుగుదేశంతో జత పట్టడం కంటే తెరాసకు మద్దత్తు ఇవ్వడం ప్రాంతీయ లాభసాటి బేరంగా సి.పి.ఐ భావించినట్లు కనిపిస్తుంది.

పోతే సి.పి.యంతో పొత్తుల మీద కొంత అంతర్మథనం ప్రారంభమైనట్లు కనిపిస్తున్నది. పొత్తుల పేరుతో పరిమితంగా సీట్లు పోటీ చెయ్యడం వల్ల తమ పార్టీ ప్రభావం కుంచించుకు పోతున్నదని పార్టీ విస్తరణకు తగిన ప్రత్యామ్నాయాలను ఆలోచించాలని ఆ పార్టీ భావిస్తున్నట్లు కనిపిస్తున్నది.

మొత్తం మీద వామ పక్షాలు తన పాత మిత్రత్వాన్ని తాత్కాలికంగానైనా వదులు కోకడం, భవిష్యత్తులో రాష్ట్ర రాజకీయాలలో మరో ప్రత్యామ్నాయానికి దారి చూపుతుందా లేక 2014 తిరిగి అదే గూటికి చేరతాయా? అన్నది వేచి చూడాల్సిందే. ❑



# ఉప ఎన్నికల బరిలో లోక్‌సత్తా పార్టీ అభ్యర్థులు

***రాష్ట్రంలో జరగనున్న ఉప ఎన్నికలలో లోక్‌సత్తా పార్టీ కోవూరు, మహబూబ్ నగర్ స్థానాలల్లో పోటీ చేయాలని నిర్ణయించింది. కోవూరు నియోజకవర్గానికి అభ్యర్థిగా నెల్లూరి నర్సయ్య, మహబూబ్ నగర్ నియోజక వర్గానికి మొహ్మద్ గౌస్ మొయినుద్దీన్‌లను అభ్యర్థులుగా ప్రకటించింది.***

***తెలంగాణాలో మిగిలిన 5 స్థానాలకు తమ పార్టీ పోటీ పెట్టడం లేదని, తెలంగాణా కోసం పార్టీలను వీడినవారే అభ్యర్థులుగా కొనసాగుతున్నందున వీరి రాజీనామాలకు వెనుకవున్న మనోభావాలను గౌరవిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు.***

ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్నవి ఉపఎన్నికలు మాత్రమే. కాంగ్రెస్ పార్టీ గెలవకపోయినా దానికి అధికారం పోదు. తెలుగుదేశం పార్టీ, వై.యస్.ఆర్.కాంగ్రెస్‌లలో ఏది గెలిచినా వారికి అధికారం రాదు. ప్రజలు తమ భవిష్యత్తు కోసం ఆలోచించి మరీ ఓటు వెయ్యాల్సిందిగా కోరుతున్నాం. ప్రజలు తమ ఓటుతో అధికారాన్ని ఇస్తున్నారు. ప్రజల పన్నుల సొమ్ముతో పాలన సాగించమని ఎన్నుకుంటున్నారు. అందుచేత ఎన్నికలు పార్టీలకోసం కాదు. అభ్యర్థుల కోసం కాదు. ఎన్నికలు ప్రజలకోసం, వారి పిల్లల భవిష్యత్తుకోసం. ప్రజలు ప్రభువులు – అభ్యర్థులు కేవలం సేవకులు మాత్రమే. ఇప్పుడు ఆలోచించండి ఎవరికి ఓటు వెయ్యాలో – ఎవరికి అధికారం ఇవ్వాలో...



గౌస్‌మొయినుద్దీన్ మహబూబ్ నగర్ — నెల్లూరు నర్సయ్య కోవూరు

**ఉప ఎన్నికలలో లోక్‌సత్తా పార్టీ అభ్యర్థులు**

**ఓటర్లకు లోక్‌సత్తా పార్టీ విజ్ఞప్తి**

ప్రస్తుతం పోటీలోవున్న కాంగ్రెస్ పార్టీ అధికారంలో వుంది. తెలుగుదేశం పార్టీ 9 ఏళ్లపాటు అధికారంలో వుంది. ఆరుసంవత్సరాలు అధికారంలో వున్న దివంగత ముఖ్యమంత్రి పేరుతో వారసత్వం కోసం పుట్టుకొచ్చినది వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ఈ **మూడు పార్టీలలో**

- ఏ ఒక్కరైనా తమ పాలనలో అవినీతికి అడ్డుకట్ట వేశామని చెప్పుకోగలస్థితి లేకపోగా అవినీతి కుంభకోణాల పరంపరలకు కారకులు గానే వున్నారు.
- ఏఒక్కరైనా వ్యవసా యాన్ని లాభసాటి చేశామని చెప్పుకోగల స్థితి లేకపోగా రైతులకు, కౌలుదారులకు ఆత్మహత్యల చరిత్రే మిగిల్చారు.
- ఏ ఒక్కరైనా యువతకు మంచి ప్రమాణాల చదువునీ, నైపుణ్యాలనీ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించలేనందునే రాష్ట్రంలో లక్షలాదిమంది పేద నిరుద్యోగ యువతీయువకులు నిరాశా, నిస్పృహలతో మగ్గుతున్నారు.
- ఏ ఒక్కరైనా మద్యనియంత్రణకు కఠిన చర్యలు తీసుకోకపోగా మద్యాన్ని ఏరులైపారించారు. మద్యం వ్యాపారం అంతా వీరి అనుచరులతోనే నడుస్తున్నది. ప్రతిచోట సిండికేట్లలో అందరూ భాగస్వాములుగా వుండి రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్ చేశారు. పేదల జీవితాలని నరకం చేశారు.
- ఏ ఒక్కరైనా ఓట్ల పథకాల చుట్టూ తిరగడం తప్ప పేదలకు స్వతంత్ర జీవనాన్ని ఇవ్వడానికి, వారి పిల్లలకు అందరితో సమానంగా మంచి ప్రమాణాల చదువు, వైద్యం

అందించడానికి చర్యలు తీసుకోనందునే పేదరికం శాశ్వతం అయింది. వారి పిల్లల బతుకు బండల వుతున్నది.

- ఏ ఒక్కరైనా మన పంచాయితీలకు నిధులు, విధులు అప్పగించడానికి చిత్తశుద్ధితో కృషిచేయనందునే సర్పంచులు,ఎం.పి.టి.సి.లు, జడ్పిటీసీలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలారు. గ్రామాలు అనారోగ్యంలో అవిద్యలో మగ్గుతున్నాయి.
- ఏ ఒక్కరి పాలనలోనైనా మన బడి చదువుల బడిగా మారలేదు. మన ఆరోగ్య కేంద్రాలు వైద్య సేవలందించేవి కాలేదు. మన ప్రభుత్వ ఆఫీసుల అదించే సేవలు మెరుగు కాలేదు.

**ఇప్పుడు ఆలోచించండి.... మన కులం అని వారికే ఓటు వేస్తారా!**

**డబ్బు, సారా బాగా పంచుతున్నారని ఓటు వేస్తారా!**

మనకి అన్ని వనరులు వున్నా, ఇతర రాష్ట్రాలకంటే అధిక పన్నుల రాబడివున్నా, మన రాష్ట్రానికి పాలనా దారిద్ర్యం పట్టింది. విధానాలు లేని పార్టీలని, ఓట్ల రాజకీయం పార్టీలని గెలిపిస్తే ఎవరి బతుకులూ బాగుపడవు.

ఈ పరిస్థితి మారాలంటే ఈ రాజకీయం మారాలి. కొత్త రాజకీయం రావాలి. స్పష్టమైన విధానాలు గల పార్టీ, విశ్వసనీయత గల నాయకత్వం గల పార్టీ, చేసేదే చెప్తాం – చెప్పింది చేస్తాం అని నిలబడ గల పార్టీ కావాలి. లోక్‌సత్తా పార్టీ ఈ రాజకీయాన్ని మార్చడానికి వచ్చిన పార్టీ – ఈ కొత్త రాజకీయాన్ని ఆదరించండి మీ ఓటు ద్వారా దానికి బలాన్ని ఇవ్వండి.

ఎవరికైనా గెలుపు ఓటములు మీరిచ్చే ఓట్ల మీద ఆధారపడి ఉంటాయి. ఓటు మీసత్తా... మార్పు మా సత్తా. రైతులు, యువత, మహిళలు, పేదలు తమ కోసం ఆలోచించుకుని మంచి భవిష్యత్తుకు ఓటు నివ్వండి. కోవూరు, మహబూబ్ నగర్ లో లోక్‌సత్తా పార్టీ అభ్యర్థులను గెలిపించండి – కొత్త దారి రాష్ట్రానికి చూపించండి. ❑

# ఉత్తరాలు

## కె.పాలవాయి రాధిక, రాయదుర్గం

నిజాయితీ లేని ఉద్యమాలు : ఏ నేత ఉద్యమం చేపట్టినా ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చినప్పుడు ఆ ఉద్యమం విజయవంతం అవుతుంది. అయితే నేడు కొందరు నేతలు చేసే దీక్షల వెనుక స్వార్థం, అధికార దాహంతో పాటు స్వలాభాపేక్ష తోటి ఉద్యమాల పేరిట– ఉద్యమాలు లేవనెత్తి లాభం పొందాలనే ప్రయత్నాలూ చేస్తున్నారు. ఇలాంటి వాటిని, ఇలాంటి వారిని జనం తిప్పికొట్టాలి. నేడు ప్రజల బతుకు తెరువుకోసం పరుగులు తీస్తూ –అలుపెరుగని ప్రయాణం చేస్తున్నారు కానీ, ఒక్కక్షణం దేశం గురించి ఆలోచించడం లేదనిపిస్తుంది. ఏదో మొక్కుబడిగా ఓటు వేసి రావడం, ఎవరు గెలిస్తే నాకేంటి, నాపని నాకు తప్పదు – అంటూ మెట్టవేదాంతాన్ని వల్లిస్తున్నారు. జనం జనంలోని జాగృతి ప్రభాకరుడి దివ్య తేజస్సును మించిన వెలుతురున్నప్పటికీ... నేతల జిమ్మిక్కులముందు జనంలోని తెలివితేటలు బలాదుర్. ప్రజలలో ముందుగా ఐక్యతను పెంపొందించుకుంది, ప్రజలకు మంచి జరగడం కోసం మనలోనే ఒకరిని ఎన్నుకొని... మంచికోసం ఉద్యమాలు చేపడితే అప్పుడు స్వార్థపర శక్తులు దారులు వెతుక్కుంటాయి. సంఘవిద్రోహక శక్తులు, అధికార దాహనికి దాసులైన వారు అదృశ్యం అవుతారు.

ప్రజాస్వామ్య దేశంలో ప్రజలే మొదటి స్థానాన్ని అక్రమిస్తున్నారు. ప్రజల మాటలకు అంత ప్రాముఖ్యత ఉంది. అందుకే రాబోయే తరంలో నిజాయితీ కలిగిన నేతల ద్వారా, నిజాయితీ గల ఉద్యమాలను చేపట్టి గాంధీ కలలు కన్న భారతావనికి పునాదు వేద్దాం రండి.

రాచపాళెం రఘు నెల్లూరు "ప్రాసబాసలు" నుండి

**ఆశ అనే పాశానికి**
**అంతనేది లేదు**
**చిన్న ఆశ లేకుంటే**
**జీవితమే చేదు**

# ఆంక్షలను తుంగలో తొక్కి..మంజీరాలో కలిపి

## జైత్రయాత్రలా సాగిన జయప్రకాష్ నారాయణ్ రైతు యాత్ర



రెండు యాత్రలు, రెండు ప్రాంతాలు, రెండు రాష్ట్రాలు లక్ష్యం ఒక్కటే. ధాన్యం పక్క రాష్ట్రాలకు అమ్మకుండా, రైతులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విధించిన అక్రమ ఆంక్షలను ఉల్లఘించడమే. ఎమ్మిగనూరు నుండి మంత్రాలయం మీదుగా తుంగభద్రానది దాటి కర్నాటకలోని దిల్గాసుగూర్ వరకు మొదటిది పాదయాత్ర. నిజామాబాద్ జిల్లా పోచారం నుండి ఎల్లారెడ్డి, బాన్సువాడ, బోధన్ ద్వారా మంజీరా నదిని దాటి మహారాష్ట్రలోని ఎస్గి గ్రామం వరకు వాహన రైతుమహా యాత్ర. రెండు చోట్ల జరిగింది ఒక్కటే. ఆంధ్రప్రదేశ్‌లో వరి ధాన్యాన్ని అయిన కాడికి అమ్ముకుందామన్నా అమ్ముడు పోకుండా పంటరాగానే రేట్లు పడిపోతూ పక్క రాష్ట్రాల్లో మన రాష్ట్రంకంటే బస్తాకి వందా, నూటాయాభై రూపాయాల వరకు ఎక్కువ రేటు వస్తున్నా ధాన్యాన్ని పక్క రాష్ట్రాలకు పోకుండా అడ్డుపడుతున్న రాష్ట్రప్రభుత్వాన్ని దిక్కరించడమే యాత్ర లక్ష్యం. ఆ లక్ష్యం రెండు చోట్లా నెరవేరింది.

కులాలు వేరైనా, ప్రాంతాలు వేరైనా, పంటలు వేరైనా పార్టీలు వేరైనా రాష్ట్రాలు వేరైనా, భాషలు వేరైనా రైతులందరం ఒక్కటే నని ఈ యాత్రలు చాటిచెప్పాయి. ఆంధ్రప్రదేశ్‌లోని వరి ధాన్యం తమ రాష్ట్రాలకు వస్తే తమ రేట్లు ఎక్కడ పడిపోతాయోనన్న ఆందోళన పక్క రాష్ట్రాల రైతులకు లేదు. వారు మన రైతులను సాదరంగా ఆహ్వానించారు. అక్కున చేర్చుకున్నారు. మా రాష్ట్రంలో లేని ఆంక్షలు మీ రాష్ట్రం ఎందుకు విధించాలని ప్రశ్నించారు. రైతులుగా మీరూ, మేమూ ఒక్కటే నన్నారు. మన ధాన్యాన్ని పవిత్రమైన ఉద్యమ సంకేతంగా భావించి, ధాన్యం ఎంతని చూడకుండా లక్షరూపాయల చొప్పున కొనుగోలు చేశారు. అలనాడు ఉప్పుసత్యాగ్రహంలో ఉప్పును



ఉద్యమానికి సంకేతంగా భావిస్తే నేడు రైతుల కష్టాలు కడగళ్ళు తీరి లాభసాటి ధరలతో వ్యవసాయం సుభిక్షం కావాలని వరి ధాన్యాన్నే సంకేతంగా భావించారు. రాష్ట్రాలు దాటించి ఆంక్షలను ఉల్లంఘించారు. సుమారు సంవత్సరం నుండి రైతులకి గిట్టుబాటు ధరలు కాదు, లాభసాటి ధరలు అనే నినాదంతో రైతులందరిని ఏకం చేస్తూ డా॥జయప్రకాష్ నారాయణ్ గారి సారధ్యంలో స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య ఏర్పాటు చేయడం జరిగింది. ఇప్పటి వరకు రైతు పోరాటాలు ఎన్నో జరిగాయి. కొన్ని విజయాలు కూడా సాధించాయి. కానీ ఇప్పటికి రైతు దేశంకోసం త్యాగం చేస్తూ తాను క్రొవ్వొత్తయి కరిగిపోతుంటే మధ్యదళారిలు బలిసిపోతున్నారు. వ్యవసాయం గుదిబండై రోజు రోజుకు వ్యవసాయ రంగంలో స్థూల ఆదాయాలు, ఉపాధి అవకాశాలు మృగ్యమై పోయాయి. దీనిని గమనించి గత రైతు ఉద్యమాల స్ఫూర్తితో కొత్తగా రైతు సంఘాలని, రైతులను ఏకం చేస్తూ ఈ సమాఖ్య ఏర్పాటు చేశారు.

పంట పెట్టుబడిలో తన సొంత కష్టాన్ని, భూమిని పెట్టుబడి లెక్కగా తీసుకోకుండా అయిన ఖర్చును లెక్కచేస్తే కూడా హళ్ళికిహళ్ళి, సున్నాకు సున్నా లాగా వ్యవసాయం నష్టాల ఊబిలో కూరుకుపోయింది. ఈ ఊబి నుండి బయటపడాలంటే కొత్త లక్ష్యంతో కొత్త పద్ధతులతో ఉద్యమించాలని సమాఖ్య సంకల్పించింది. **"ప్రకృతి శాపం – కాదు పాలకుల పాపమే"** రైతులను ఈ దుస్థితికి తీసుకువచ్చిందని ఎలుగెత్తి చాటింది. అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా రైతులతో అవగాహన సదస్సులు, చర్చావేదికలు నిర్వహించింది. పాత సంఘాలను కలుపుకుంటూనే కొత్తగా కులాలు, పంటలు, పార్టీలకు అతీతంగా స్వతంత్రరైతు సంఘాలను ఏర్పరించింది. సంఘంగా ఏర్పడగానే సరిపోదు. తర్వాత ఉద్యమ కార్యాచరణ కావాలని ఈ యాత్రలను మొదలు పెట్టింది. అంతం కాదిది ఆరంభమని మన రాష్ట్రాన్ని అనుకొని ఉన్న కర్నాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, ఒడిసా, తమిళనాడు రాష్ట్రలకి ధాన్యాన్ని తరలించి ప్రభుత్వ ఆంక్షలను ఉల్లఘించడానికి ఏర్పాటు చేసింది. మొదటి విడతగా ఫిబ్రవరి 18,19 తేదిలలో కర్నాటక రాష్ట్రానికి 25,26 తేదిలలో మహారాష్ట్రకి రైతు యాత్రలను విజయవంతంగా పూర్తిచేసింది.

వరి ధాన్యం ఆంక్షలపై అసెంబ్లీలో చర్చకూడా జరిగింది. 1980లో దేశంలో పార్లమెంటులో జరిగిన చర్చలాగే మన అసెంబ్లీలో కూడా అదే చర్చ. ధాన్యాన్ని పక్కరాష్ట్రాలకి



అనుమతిస్తే మన రాష్ట్రంలో ధాన్యం ధర పెరిగి బియ్యం కొనే వారికి కష్టాలు వస్తాయని మన ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి వాదించారు. ధరలు పెరిగాయని గగ్గోలు పెట్టకుండా ఉంటానంటే అప్పుడు ఆంక్షల ఎత్తివేతపై ఆలోచిస్తామని ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడుకు సవాలు విసిరాడు. అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోమాట మాట్లాడే ఈ పార్టీలకి ఆ సవాలును స్వీకరించే ధైర్యం లేకపోయింది. ఇప్పుడే కాదు. దేశంలో కాంగ్రెస్‌పోయి, జనతాపార్టీ వచ్చినా, రాష్ట్రంలో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు పాలించినా రైతుల కష్టాలు కడగళ్ళు తీరలేదు. ఇటు రైతులను అటు వినియోగదారుల ప్రయోజనాలను కాపాడి ఉభయుల ఆకాంక్షలకు వారధి కట్టే ప్రయత్నం ఈ ప్రభుత్వాలు ఏవీ చేయలేదు. పైగా రైతులకు, రైతు కూలీలకి, వినియోగదారులకు తంపులు పెట్టి వాళ్ళ మిత్ర వైరుధ్యాలను శత్రు వైరుధ్యాలుగా చూపెడుతుంది. పండించే రైతుకు ధరవస్తే వినియోగించే వినియోగదారునికి అడ్డగోలుగా ధరలు పెరుగుతాయని చేసే ప్రచారం సరైనది కాదు. రైతుకు మూడు రూపాయలు వస్తే వినియోగదారులకు ముప్పై రూపాయలకు అమ్మే దళారి వ్యవస్థలో మనం ఉన్నాం. ఈ మధ్య దళారి వ్యవస్థని సాధ్యమైనంత తగ్గించి ఇద్దరి ప్రయోజనాలను కాపాడే ప్రయత్నం పాలకులు చేయలేదు.

మహాభారతంలో ద్రోణాచార్యుడు విలువిద్యలో పరిక్ష పెట్టినప్పుడు చెట్టూ, పుట్టా, పిట్టా కనపడడం కాకుండా అర్జునుడికి పిట్టకన్ను మాత్రమే ఎలా కనబడిందో పండిన పంటకు హక్కుగా సరైన ధర రావాలని ఏకసూత్ర ప్రణాళికతో స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య ఈ విషవలయాన్ని ఛేదించింది.

ఎమ్మిగనూరులో డా॥జయప్రకాష్ నారాయణ్ చారిత్రాత్మక రైతు సత్యాగ్రహ పాద యాత్ర మొదలు పెట్టినప్పుడు చేసిన ప్రసంగం స్ఫూర్తినిచ్చింది. 36 కిలోమీటర్ల యాత్రపొడువున ఎదురైన ప్రతి గ్రామంలో రైతులు, గ్రామప్రజలు నీరాజనాలు పట్టారు. మంత్రాలయంలో జేపీ చేసిన ప్రసంగంలో ఆహారసేకరణ దశనుండి ఉత్పత్తి దశకు ఎలా చేరామో వ్యవసాయం ఎలా ప్రారంభించామో, వ్యవసాయం వల్ల గ్రామాల ఏర్పాటు ఎలా జరిగిందో సోదాహరణంగా వివరించారు. ఆర్థిక వ్యవస్థకు మూలాలు వ్యవసాయంలో ఉన్నాయని ఆ మూలాలని తెగనరికితే మనం కుప్ప కూలిపోతామని ఆందోళన వెలిబుచ్చారు. తుంగభద్రానది ఆవల కర్నాటక రైతులతో పాటు, లోక్‌సత్తా కర్నాటక శాఖవారు సాదరంగా మన రైతులను స్వాగతించారు. 2009లో వరదల్లో తుంగభద్రానది మీద ఉన్న పాత వంతెనతో పాటు రైతుల కష్టాలు, కడగళ్ళు చూసి కాబోలు. వంతెన పక్కనున్న చెక్‌పోస్టు కూడా కొట్టుకుపోయింది. దాన్ని మళ్ళీ ఎవరు పునఃరుద్ధరించలేదు. ఆంక్షల దారి ఆంక్షలదే దొంగరావాణా దారి దొంగరవాణాదే. బహిరంగంగా ఆంక్షలను ఉల్లఘిస్తున్నామని చేతనైతే అరెస్టు చేయండని మాధవరం గ్రామంలో జేపీ ప్రభుత్వాన్ని సవాలు చేశారు. ఈ యాత్రలో అరెస్టు చేస్తారా, చేయ్యరా అనే ఉద్వేగం అరెస్టు చేసినా బెయిలు తీసుకోమనే మొండి పట్టుదల కనిపించాయి. రైతుల కోసం జైలుకెళ్ళడానికి జేపీ సిద్దపడ్డారు. వారి వెంటే మిగతా రైతులంతా సిద్దపడ్డారు. **"ఒక వేళ జేపీ అరెస్టయి ఆంక్షల ఉల్లఘన కోర్టులో రుజువై శిక్షపడితే ప్రస్తుతం ఉన్న శాసన సభ్యత్వం రద్దు అయ్యేది. మరో ఆరేళ్ళ వరకు ప్రజాప్రతినిధిగా ఎన్నికల్లో పోటి చేసే అవకాశం కూడా కోల్పోయేది. కానీ ప్రభుత్వం అరెస్టు చేయలేదు. ఆంక్షలు ఎత్తివేయలేదు. దున్నపోతు మీద వానపడ్డట్టు మిన్నకుండిపోయింది.**

ఇక రెండవ యాత్ర నిజామాబాద్ జిల్లాలో పోచారం నుండి మొదలైన **"రైతు మహా యాత్ర"** చాలా ఉల్లాసంగా, ఉత్సాహంగా రైతుల పోరాటంలో మరో మైలురాయిగా నిలిచిపోయింది. ఉద్వేగం ఉంది సస్పెన్స్ లేదు. చివరికి రిజల్ట్ ఏమౌతుందో అందరికి తెలుసు అందుకే వరుసగా నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, బాన్సువాడ, వర్ని, రుద్రూరు, బోధన్‌లో జరిగిన సభల్లో జేపీ పదే పదే ఒకే విషయం చెప్పారు. ఆంక్షలను ఎత్తివేయండి లేకుంటే అరెస్టు చెయ్యండి. ఒకే మాటా ఒకే బాణం. తిరుగులేని బాణంలా రెండవ రోజు కోటగిరి, ఎత్తొండ, సాలంపేట, సాలూరు, సమీకృత తనిఖీ కేంద్రం (చెక్‌పోస్టు) ద్వారా మంజీరానది దాటి విజయవంతంగా ఆంక్షలను ఉల్లఘించారు. ధాన్యం బస్తాలతో ఉన్న ఎడ్లబండిని జేపీగారు నడిపారు. నది అవతల మహారాష్ట్ర శెట్కారి సంఘటన రైతులు గుణవంతరావు పాటిల్ తదితరుల అధ్వర్యంలో సాదరంగా స్వాగతం పలికారు. **అయ్యప్ప స్వామి భక్తులలాగా చాలా మంది రైతులు నెత్తిమీద ధాన్యం సంచితో ఇరుముడితో వడివడిగా నడిచి నదిని దాటారు. విజయోత్సాహంతో నృత్యాలు చేశారు. సిగ్గులేని ప్రభుత్వమా ఆంక్షలను ఎత్తివేయి అంటూ నినాదించారు. ఆవాజ్‌దో హమ్ ఏక్‌హై అంటూ దిక్కులు పిక్కటిలేలా రైతులు నినాదాలు చేశారు. కిసాన్ ఎక్తాజిందాబాద్ అంటూ ఎలుగెత్తి చాటారు.** ❑

**- బండారు రామ్మోహన్ రావు**

# అమ్ముకునే స్వేచ్ఛ కోసం, లాభసాటి ధరల కోసం ఎమ్మిగనూరు నుండి మహోద్యమంగా సాగిన రైతు సత్యాగ్రహ పాదయాత్ర



ఆంధ్రప్రదేశ్‌లో రైతుల ఉద్యమం ఒక కొత్త మలుపుతిరిగింది. రాయితీల భిక్షాటనకు స్వస్తి చెప్పి రైతులు లాభసాటి పంట ధరలకోసం విధాన పరమైన అంశాల మీద పోరాటానికి ఉద్యుక్తులయ్యారు. రాష్ట్రంలో సంప్రదాయ పార్టీలన్నీ రైతుల్ని దగా చేశారు. వాళ్లు అధికారంలో వున్నప్పుడు లాభసాటి పంట ధరలు ఇప్పించడం చాతకాని వాళ్లు తమకి అధికారం ఇస్తే రైతుల రాజ్యం తెస్తామని వాగ్దానాలు చేసిన వాళ్లు మాటలన్నీ బూటకాలని తేలింది. అంతా రైతుల కష్టాలకు కన్నీరు కార్చేవారే గాని వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుండి బైట పడేసే విధానాల స్పష్టత ఏ ఒక్కరికీ లేదు. ఓటు బ్యాంకు రాజకీయాలతో రైతులకు అరకొర రాయితీలు ప్రకటించడమే కాని పంటలకు లాభసాటి ధరలకు అవసరమైన చర్యలు చేపట్టగల వారు కాదని స్పష్టమైంది.

ఈ దశలో లోక్‌సత్తా అధినేత డా॥జయప్రకాష్‌నారాయణ్ సారధ్యంలో స్వతంత్రరైతు సంఘాల సమాఖ్య ఏర్పడింది. పార్టీలకు అతీతంగా రైతుల్ని సంఘటిత పర్చడానికి నిర్ణయించుకుంది. రాయితీలకు బదులు రైతుల్ని లాభాల బాట పట్టించే విధానాల మీద పోరుకు సిద్ధమైంది. పంటల్ని ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛకోసం, ఒక వినూత్నమైన ఉద్యమాన్ని చేపట్టింది.

ఫిబ్రవరి 18,19 తేదీలలో ఎమ్మిగనూరు నుండి కర్నాటకలోని గిల్కాసుగూర్‌కు రైతు సత్యాగ్రహపాద యాత్ర సాగించింది. ఆంక్షల్ని ఉల్లంఘించి బియ్యం అమ్మకాలు సాగించింది. రైతులు బ్రహ్మరథం పట్టారు. స్పష్టమైన విధానాలతో, పార్టీ సనీయత గల నాయకత్వంతో, రైతుల ఐక్యతతో సాగించే ఉద్యమాలు విజయం సాధిస్తాయనడానికి ఈ ఉద్యమం దర్పణం పట్టింది. ఈ సత్యాగ్రహ పాదయాత్రపై పత్రికలలో వచ్చిన వార్తలలో కొన్నింటిని పాఠకులకు అందిస్తున్నాం.

# అంతం కాదిది ఆరంభం

ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఉల్లంఘిస్తూ పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో లోక్‌సత్తా అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ ధాన్యం విక్రయించారు. ఆంక్షలకు విరుద్ధంగా ధాన్యం విక్రయించినా ప్రభుత్వం అడ్డుకోలేకపోయిందంటే రైతులు ఇక స్వేచ్ఛగా తమ ఉత్పత్తులను బయట ప్రాంతాల్లో అమ్ముకోవచ్చని ఆయన పిలుపునిచ్చారు. ఇది అంతం కాదు ఆరంభమని, రైతుకోసం ఎంతవరకైనా పోరాడతామని హామీ ఇచ్చారు. పండించే పంటలను ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛ రైతుకు ఉండాలంటూ జేపీ చేపట్టిన రైతు సత్యాగ్రహ పాదయాత్ర కర్ణాటకలోని గిల్కాసూగూరు క్యాంప్ వద్ద ముగిసింది. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నుండి యాత్ర ప్రారంభించిన జేపీ... రెండోరోజు యాత్రను మంత్రాలయం నుంచి మొదలుపెట్టారు. చెట్నేపల్లి మీదుగా మాధవరం, తుంగభద్ర బ్రిడ్జి, పాత తుంగభద్ర గ్రామం, గిల్కాసూగూర్ క్యాంపు వరకు 13 కి.మీ. మేర సాగింది. దారి పొడవునా రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. రైతుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని దుయ్యబట్టారు. పాదయాత్రలో భాగంగా రైతులు, రైతుసంఘాల ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్రంలోకి తీసుకుపోయిన 5 క్వింటాళ్ల ధాన్యాన్ని గిల్కాసూగూర్ క్యాంపులో వేలంపాట వేశారు. రామలక్ష్మి అనే మహిళ రూ. లక్ష వెచ్చించి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా గిల్కాసూగూర్ క్యాంప్‌లో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అమ్మకం స్వేచ్ఛపై ప్రభుత్వం విధించిన ఆంక్షలకు వ్యతిరేకంగా చేపట్టిన ఈ యాత్ర మరో సత్యాగ్రహ విజయమని పేర్కొన్నారు. ఇది ప్రభుత్వానికి కనువిప్పు కావాలన్నారు. తుంగభద్ర తీరం దాటి అవతలి గట్టుకు చేరినా తన అరెస్టుకు ప్రభుత్వం ముందుకు రాలేదంటే, ఇక నుంచి ప్రతి రైతు కూడా తమ ఉత్పత్తులను బయట ప్రాంతాల్లో యథేచ్ఛగా అమ్ముకోవచ్చని భరోసా ఇచ్చారు. తన యాత్ర రైతులకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. ఒకవేళ రైతులను స్వేచ్ఛగా అమ్ముకోనివ్వకుండా ఎవరైనా అడ్డుపడితే తన దృష్టికి తీసుకురావాలని, ఎంతవరకైనా పోరాటం సాగిస్తానని హామీ ఇచ్చారు. యాత్ర విజయవంతం కావడం ద్వారా రైతులపై ప్రభుత్వం విధించిన ఆంక్షలకు చెల్లుచీటీ రాసినట్లైందన్నారు. ఫిబ్రవరి 12 ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఓ గొప్పరోజుగా నిలిచిపోతుందన్నారు. కర్ణాటక సరిహద్దులోని మాధవరం వంతెన వద్ద తెలుగు, కన్నడ రైతులు భారీగా తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. జేపీ మంత్రాలయం నుంచి మాధవరం వరకు ఎడ్లబండిపై వచ్చారు. వంతెన వద్ద కొద్ది సేపు పోలీసులు అడ్డుకోవడంతో కొంత ఉత్కంఠ నెలకొంది.

అంతకుముందు మంత్రాలయంలో ప్రజలనుద్దేశించి జేపీ ప్రసంగిస్తూ.... రైతులు ఎక్కడైనా పంటలు అమ్ముకోవచ్చంటూ మంత్రాలయం రాఘవేంద్రుని సాక్షిగా తాను ఈ ఉద్యమానికి పూనుకున్నానన్నారు. విద్యార్థులు, యువత మేల్కొని ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

విదేశాల్లో 3 శాతం ఉన్న రైతులను కాపాడుకునేందుకు ఆ ప్రభుత్వాలు అనేక సౌకర్యాలు కల్పిస్తుంటే... మన దేశంలో మాత్రం 60 శాతం ఉన్న రైతుల జీవితాలను దుర్మార్గపు ప్రభుత్వం పొట్టన పెట్టుకుంటుందన్నారు. 2009 వరదల్లో కర్నూలు జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోతే ఇప్పటివరకు వారిని ఆదుకోవడం ఈ ప్రభుత్వానికి చేతకాలేదన్నారు. ఉపాధి నిధుల ద్వారా ఏటా రూ.7 వేల కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వానికి రైతుల పొలాల్లోని ఇసుకమేటలు తొలగించేందుకు చేతకాలేదన్నారు. వర్షాలు లేక రాయలసీమ కరువుబారిన పడుతున్నారంటూ.... వారిని ఆదుకునేందుకు ఉపాధి నిధులను వినియోగించవచ్చని చెప్పారు. తాను ఒంగోలు కలెక్టర్‌గా ఉన్న సమయంలో రెండేళ్ల వ్యవధిలో రూ.46 కోట్లతో 2 లక్షల ఎకరాలు ఎత్తిపోతల కింద సాగులోకి తీసుకువచ్చానన్నారు.

రాష్ట్రంలో ఇప్పటి వరకు ఖర్చు చేసిన ఉపాధినిధులతో రైతుల జీవితాలను మార్చి, అద్భుత ఫలితాలు సాధించే అవకాశం ఉన్నా... ఆ నిధులన్నీ నేతల జేబుల్లోకి వెళ్లాయన్నారు. కలెక్టర్, మంత్రుల బిడ్డలతో సమానంగా రైతు బిడ్డలు ఎదిగే అవకాశాలు లేకుండా పోయాయన్నారు. ప్రభుత్వం రైతుల పట్ల ఇదే వివక్ష చూపితే రాబోవు రోజుల్లో అన్ని సరిహద్దు జిల్లాల్లోనూ రైతు సంఘాలు, రైతులను కూడగట్టి ఉద్యమాలు చేస్తామన్నారు. త్వరలోనే నిజామాబాద్ – నాందేడ్, తడ – తమిళనాడు, శ్రీకాకుళం – భువనేశ్వర్ సరిహద్దు ప్రాంతాల్లో పాదయాత్రలు

చేపడతామన్నారు. రైతుల పట్ల ప్రభుత్వం దుర్మార్గాలు అంతరించే వరకు పోరాటం ఆపబోమన్నారు. రైతు సత్యాగ్రహ యాత్ర కోసం చేపట్టిన ఉద్యమాన్ని పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా బ్రహ్మరథం పట్టాయని, ప్రజల తరఫున పనిచేశాయని అభినందించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకునే వరకు లోక్‌సత్తా రైతుల తరపున పోరాటం చేస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు. జేపీ ప్రతిపాదించిన అంశాలు....

–రైతుల అమ్మకాలపై విధించిన ఆంక్షలను పూర్తిగా ఎత్తివేయడం. ఏ ప్రాంత రైతులైనా తమ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లో మంచి ధర ఉందని తెలిస్తే.... అక్కడే అమ్ముకునే వెసులుబాటు కల్పించడం... సుంకాలను రైతుల రక్షణ కోసం వినియోగించడం.

– రైతుల నుంచి వివిధ పన్నుల రూపంలో వసూలు చేస్తున్న మొత్తాన్ని తిరిగి రైతు ప్రయోజనాల కోసమే ఖర్చుచేయడం.

– ఉపాధి నిధులు కింద చేపట్టే పనుల్లో 90 శాతం నిధులతో వర్షం లేక పంటలు ఎండిపోతున్న రైతుల కోసం భూగర్భజలాలు పెంపు, ఇతర రైతు అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించడం.

### వెనక్కు తగ్గిన ప్రభుత్వం

ధాన్యం తీసుకుని ఆంధ్ర సరిహద్దు దాటిన జేపీని తొలుత అరెస్టు చేయాలనుకున్న అధికారులు ఆ తరువాత వెనక్కు తగ్గారు. పౌరసరఫరాల చట్టం కింద రెవెన్యూ అధికారుల నుంచి అనుమతి లేకుండా ధాన్యం తీసుకుపోతున్నారన్న అంశంపై కేసు పెట్టాలని ఆధోని ఆర్డీవో రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సరిహద్దు ప్రాంతంలో ధాన్యం సీజ్ చేసేందుకు రెవెన్యూ పోలీసులు జేపీ దృష్టికి తీసుకురాగా... ధాన్యం సీజ్, చేసేందుకు ఆయన నిరాకరించారు. ధాన్యం విక్రయించేందుకు వెళుతుంటే 300 మంది పోలీసులు ఎందుకని ప్రశ్నించారు. తనను అరెస్టు చేస్తే ఒప్పుకుంటా కాని, ధాన్యం సీజ్‌కు అంగీకరించే అవకాశం లేదన్నారు. దీంతో అధికారులు వెనక్కు వెళ్లిపోయారు. ❑

# ఈ పాలనకంటే జైలే మేలు!

## లోక్‌సత్తా పార్టీ అధినేత డాక్టర్ జయప్రకాష్ నారాయణ్

### ఎమ్మిగనూరు సోమప్ప సర్కిల్‌లో ప్రసంగిస్తున్న జయప్రకాష్ నారాయణ్

ఎమ్మిగనూరు:పంట ఉత్పత్తిదారులైన కౌలురైతులు, సన్న, చిన్న కారురైతులను మోసగిస్తూ చట్టాలనే ఉల్లంఘించే దుర్మార్గపు పాలనలో ఉండేకంటే జైల్లో ఉండటమే మేలని లోక్‌సత్తా పార్టీ అధినేత డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. పంట ఉత్పత్తులను ఇతర రాష్ట్రాల్లో అమ్ముకోనీయకుండా ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ డా॥జయప్రకాష్‌నారాయణ్ ఎమ్మిగనూరు నుంచి రైతుల సత్యాగ్రహ పాదయాత్రను ప్రారంభించారు. ముందుగా స్థానిక శ్రీనీలకంఠేశ్వరస్వామి దేవాలయంలో పూజలు చేసి ఎద్దుల బండిపై ర్యాలీగా సోమప్ప సర్కిల్‌కు చేరుకున్నారు. అక్కడ చేనేత పితామహుడు మాచాని సోమప్ప విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన రైతులు, రైతు సంఘం నాయకులనుద్దేశించి మాట్లాడారు. కేంద్రం జారీ చేసిన జీవో నంబర్ 24(03-10-2011)ను రాష్ట్ర ప్రభుత్వమే ఉల్లంఘించి రైతులను మోసం చేస్తోందన్నారు. చట్టాలను ఉల్లఘించిన రాష్ట్ర ప్రభుత్వంపై కేసు నమోదు చేయాలని, ఆ కేసును ఎక్కడ పెట్టాలో, ఏ పోలీస్ స్టేషన్‌లో పెట్టాలో తెలియకే రైతులతో పాటు రోడ్డెక్కామన్నారు. ఎమ్మిగనూరు నుంచి మంత్రాలయం, మాధవరం మీదుగా కర్ణాటకకు వెళ్లి వరి ధాన్యాన్ని విక్రయిస్తామని పేర్కొన్నారు. పండించిన పంటలను రైతులు ఎక్కడైనా, ఎప్పుడైనా అమ్ముకునే స్వేచ్ఛ ఉందన్నారు. అయితే చట్టాన్ని ఉల్లంఘించినట్లు తన పై అభియోగాలు మోపి అరెస్ట్ చేస్తే జైలుకెళ్లేందుకు సిద్ధమేనన్నారు. బెయిల్ కోసం లాయర్లను సంప్రదించబోనని, న్యాయమూర్తుల ముందు నేరాన్ని అంగీకరిస్తానన్నారు. అరెస్ట్ చేస్తే ఎమ్మెల్యే పదవిపోతుందని, ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేసే అర్హత ఉండదని, అయినప్పటికీ ఈ దుర్మార్గపు పాలనలో ఉండేకంటే రైతుల కోసం జైల్లో ఉండటమే మేలన్నారు. ❑

# రైతు సత్యాగ్రహానికి విశేష స్పందన

**- జేపీ యాత్ర విజయవంతం**

రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు కల్పించాలనే లక్ష్యంతో లోక్‌సత్తా పార్టీ అధినేత డాక్టర్ జయప్రకాష్‌నారాయణ్ చేపట్టిన రెండు రోజుల రైతు సత్యాగ్రహ పాదయాత్రకు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, మంత్రాలయం ప్రాంతాల్లో విశేష స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచి రైతులు, రైతు సంఘాల నాయకులు, మహిళలు, యువకులు జేపీకి బ్రహ్మరథం పట్టారు. రాజకీయాలకు అతీతంగా పలు పార్టీల నేతలు సంఘీభావం పలికారు. రెండో రోజు మంత్రాలయం నుంచి ప్రారంభమైన పాదయాత్ర మాధవరం గ్రామం దాటాక ఆంధ్రాసరిహద్దు దాటనివ్వకుండా పోలీసులు, రెవిన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. ఒక దశలో జేపీని అరెస్టు చేస్తారేమోనని స్వల్ప ఉత్కంఠ నెలకొంది. అయితే ధాన్యాన్ని జేపీతో పాటు లోక్‌సత్తా నాయకులు బియ్యం మూటలను భుజాలపై మోసుకొని సరిహద్దు దాటారు. అప్పటి వరకు బందోబస్తుగా వెంటవచ్చిన పోలీసు అధికారులు, సిబ్బంది వెనుదిరిగారు. దీంతో లోక్‌సత్తాపార్టీ నాయకులు బియ్యాన్ని కర్నాటకలోని గిల్కసూగుర్ క్యాంపుకు తరలించి అక్కడ వేలంవేసి బహిరంగంగా ఐదు క్వింటాళ్ల బియ్యాన్ని రూ॥1లక్షకు విక్రయించడంతో పాదయాత్ర విజయవంతమైంది. లోక్‌సత్తా పార్టీ నాయకులు కటారి శ్రీనివాస్, బాస్కర్‌రావు, ఓంకార్, విశాలక్షి, శంకర్‌రెడ్డి, వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

---

# రైతు ఉద్యమాలకు మద్దతిస్తాం

## వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు

**ఎమ్మిగనూరు టౌన్ :** రైతు సంక్షేమం కోసం ఎవరు ఉద్యమించినా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతిస్తుందని ఎమ్మెల్యే తనయుడు, కేడీసీసీ బ్యాంక్ జిల్లా వైస్ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రమాకాంత్‌రెడ్డిలు పేర్కొన్నారు. వరిపై ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ లోక్‌సత్తా పార్టీ అధినేత డాక్టర్ జయప్రకాష్‌నారాయణ్ చేపట్టిన రైతు సత్యాగ్రహ పాదయాత్రకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ... వరికి గిట్టుబాట్టు ధర కల్పించకపోగా రైతులు ఇతర రాష్ట్రాల్లో ధాన్యాన్ని విక్రయించకుండా ఆంక్షలు విధించడం దారుణమన్నారు. రైతులు క్రాప్‌హాలిడే ప్రకటించినా పాలకుల్లో చలనంలేకపోవడం సిగ్గుచేటన్నారు. వరికి మద్దతు ధర కల్పించాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్. జగన్మోహన్‌రెడ్డితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో అనేక ఆందోళన కార్యక్రమాలను చేపట్టినా ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని విమర్శించారు. రైతుల కోసం జయప్రకాష్‌నారాయణ్ ఉద్యమిస్తుండటం అభినందనీయమన్నారు. ఇకనైనా వరిపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. జేపీని కలిసి వారిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ బసిరెడ్డి, మాచాని నాగరాజు, మాచాని ఆదిశేషులు, మాచాని వెంకటేష్, లక్ష్మీకాంత్‌రెడ్డి, సంపత్‌కుమార్‌గౌడ్, భీమిరెడ్డి, పార్లపల్లి నారాయణ, కడిమెట్ల నాగభూషణ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**వికలాంగుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించండి**

వికలాంగుల సమస్యలను అసెంబ్లీలో చర్చకు తీసుకురావాలని జయప్రకాష్‌నారాయణ్‌ను వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు శాంతిరాజు, నర్సన్న, నర్సింహులు కోరారు. ఈ మేరకు ఓ వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా 60 లక్షలకు పైగా వికలాంగులు దుర్భరమైన జీవితాలు గడుపుతూ సమాజంలో అవమానానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వైకల్య శాతాన్ని బట్టి రూ॥700ల పెన్షన్ చెల్లించడంలలో ముఖ్యమంత్రి నిర్లక్ష్యం చేస్తున్నామని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సమస్యలన్నింటిపై అసెంబ్లీలో చర్చిస్తానని వికలాంగులకు జేపీ హామీ ఇచ్చారు.

# రైతు కోసం సంకెళ్లకూ సిద్ధం

**కేంద్ర చట్టాన్ని రాష్ట్రం ఉల్లంఘించడమా ?**

**- ధైర్యముంటే నన్ను అరెస్టు చేయండి**

**- సర్కారుపై లోక్‌సత్తా అధినేత జేపీ ధ్వజం**

రైతుల కోసం తాను సంకెళ్లు వేయించుకోడానికైనా సిద్ధమేనని లోక్‌సత్తా పార్టీ అధినేత, ఎమ్మెల్యే డా॥జయప్రకాష్‌నారాయణ్ అన్నారు. ఎన్నో కష్టాలు పడి పండించిన పంటలను లాభసాటి ధరలకు అమ్ముకోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడం అన్యాయమన్నారు. ఆయన కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నుంచి కర్ణాటన వరకు రైతుసత్యాగ్రహ పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మిగనూరులో విలేకరులతో మాట్లాడారు. ఎప్పుడూ చట్టాలను గౌరవించే తాను రైతుల కోసం ప్రభుత్వ కుతంత్ర ఆంక్షలను ఎదిరిస్తున్నానన్నారు. నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం ఆహార ధాన్యాలను ఎక్కడ నుంచి ఎక్కడికైనా తరలించవచ్చని, ఆ విధానం దేశమంతటా అమలవుతున్నా రాష్ట్రప్రభుత్వం మాత్రం రైతుకు సంకెళ్లు వేసిందని జేపీ అవేదన వ్యక్తం చేశారు. కేంద్రం చేసిన చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉల్లంఘించడం నేరం కాదా అని ప్రశ్నించారు. పంటలకు లాభసాటి ధర కోసం పోరాడే తనను ధైర్యముంటే అరెస్టుచేయాలని జేపీ కోరారు. ఆంక్షల ఉల్లంఘన పర్యవసానం కూడా తనకు తెలుసునన్నారు. అరెస్టు అయి కేసు నమోదైతే శాసనసభ సభ్యత్వం పోతుందన్నారు. అయినా ప్రస్తుతం తనకు రైతు కష్టాలే ముఖ్యమన్నారు. ఇందుకోసం తాను దేనికైనా సిద్ధమన్నారు. 82 ఏళ్ల క్రితం పూజ్య బాపూజీ ఆంగ్లేయులు వేసిన ఉప్పు పన్నును వ్యతిరేకించి సత్యాగ్రహం చేశారన్నారు. తానూ అదే రీతిలో రైతు సత్యాగ్రహాన్ని ప్రారంభిస్తున్నానన్నారు. అనంతరం ఆయన ఎమ్మిగనూరు సోమప్ప సర్కిల్‌లో జరిగిన బహిరంగసభలో మాట్లాడి పాదయాత్ర ప్రారంభించారు. చేతికి సంకెళ్లు తగిలించుకుని పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి కటారి శ్రీనివాస్, రైతు సమాఖ్య నాయకుడు భాస్కరరావు తదితరులు పాల్గన్నారు. జేపీ చేపట్టిన పాదయాత్రకు అన్ని వర్గాల నుంచి విశేష స్పందన లభించింది. పార్టీలకతీతంగా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. 70 ఎద్దుల బండ్లతో ర్యాలీ కూడా నిర్వహించారు.



# రైతు క్షేమం పట్టని సర్కారుపై కేసులు పెట్టాలి

## రైతు సత్యాగ్రహ యాత్రలో లోక్‌సత్తా అధినేత జేపీ మండిపాటు

రాష్ట్ర ప్రభుత్వం లంచాల కోసమే పంట ఉత్పత్తులను పక్క రాష్ట్రాలకు తరలించకుండా ఆంక్షలు విధించిందని లోక్‌సత్తా పార్టీ అధినేత జయప్రకాష్ నారాయణ్ ఆరోపించారు. రైతు ఉసురుపోసుకుంటున్న ఈ ప్రభుత్వంపై కేసులు నమోదు చేయాలని మండిపడ్డారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నుంచి ఆయన రైతు సత్యాగ్రహ పాదయాత్రను చేపట్టారు. రైతులు తమ పంట ఉత్పత్తులను ఇతర రాష్ట్రాల్లో అమ్ముకోనివ్వకుండా ప్రభుత్వం విధించిన ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మంత్రాలయం మీదుగా కర్ణాటక వరకు సుమారు 36 కిలోమీటర్లు రైతులతో పాదయాత్ర చేపట్టి వరి ధాన్యాన్ని కర్ణాటకలో విక్రయిస్తామని ప్రకటించారు. దమ్ముంటే రాష్ట్రప్రభుత్వం తనను అడ్డుకోవాలన్నారు. తనను అడ్డుకోక పోతే రాష్ట్రంలోని ఏ రైతును అడ్డుకునే హక్కు ప్రభుత్వానికి ఉండదన్నారు. పాదయాత్ర సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతు సంఘాల ప్రతినిధులు, రైతులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో24ను రాష్ట్ర ప్రభుత్వమే ఉల్లంఘించిందని చెప్పారు. రైతుల ఉసురుపోసుకుంటున్న ఈ సర్కారుపై కేసులు పెట్టాలని, అయితే తామిచ్చే ఫిర్యాదులను పోలీసులు పట్టించుకోరని, అందువల్లే రోడ్డెక్కాల్సి వచ్చిందని వివరించారు. 82 ఏళ్ల క్రితం బాపూజీ చేపట్టిన ఉప్పు సత్యాగ్రహ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని రైతులంతా వ్యవసాయ సత్యాయగ్రహంలో పాలుపంచుకోవాలని కోరారు. ఈ సత్యాగ్రహయాత్రలో తనను అరెస్టు చేస్తే ఎమ్మెల్యే పదవి పోతుందని, చట్టం ప్రకారం ఆరేళ్ల వరకు మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కోల్పోతానని పేర్కొన్నారు. ఈ దుర్మార్గపు పాలనలో ఉండే కంటే రైతుల కోసం జైల్లో ఉండడమే మేలని నిశ్చయించుకున్నానని చెప్పారు.

### ప్రధాని కూడా చేతులెత్తేశారు...

రాష్ట్ర రైతుల సమస్యలను ప్రధాని మన్మోహన్‌సింగ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుభూతి ప్రకటించి, ఏ సాయం చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నానని చేతులెత్తేశారని జేపీ చెప్పారు. రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి పూర్తి అన్యాయం జరిగిందన్నారు. రైతు కుటుంబం తలసరి ఆదాయం రూ॥5 వేలు కాగా... వ్యవసాయేతర కుటుంబాల ఆదాయం రూ॥40 వేలు ఉందన్నారు. ఏటా రైతుల ద్వారా రూ॥2,400 కోట్లను దుండుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ సొమ్మును రైతుల కోసం కాకుండా... వేటికి మళ్లిస్తున్నారో చెప్పాలని నిలదీశారు. చేనేత రంగాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించడంతో దళారీ వ్యవస్థ ఏర్పడిందని, ఫలితంగా నేత కార్మికులకు గిట్టుబాటు కూలీ దక్కడం లేదని చెప్పారు. ఎమ్మిగనూరు నుంచి చేపట్టిన యాత్ర ముగతి, ధర్మాపురం, హాలహర్వి, చిలకలడోణ, కల్లుదేవకుంట మీదుగా మంత్రాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా సర్కారు వైఖరికి నిరసన తెలుపుతూ చేతులకు సంకెళ్లు వేసుకుని జేపీ ధాన్యం బస్తా మోశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు వివిధ ప్రజా సంఘాల నుంచి జేపీ పాదయాత్రకు మద్దతు లభించింది. పాదయాత్రలో లోక్‌సత్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటారి శ్రీనివాసరావు, రాష్ట్రకార్యదర్శులు బండారు రామ్మోహన్‌రావు, ఓంకార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబ్జీ, జిల్లా కో– కన్వీనర్ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు. ❑



# రైతుకు దేశవ్యాప్త మార్కెట్ కల్పించాలి

**మంత్రాలయం అర్బన్ :** వ్యవసాయానికి సంకెళ్లు వేస్తున్న రాష్ట్రప్రభుత్వంపై కేసులు పెట్టాలని లోక్‌సత్తా పార్టీ అధినేత జయప్రకాష్ నారాయణ్ డిమాండ్ చేశారు. దేశమంతా రైతులకు ఒకే మార్కెట్ విధానం అమలవుతుంటే రైతుప్రభుత్వమని చెప్పుకుంటున్న రాష్ట్ర కాంగ్రెస్ మాత్రం... కేంద్రం ఆదేశాలను, జీవోలను తుంగలో తొక్కుతోందని మండిపడ్డారు. అన్నదాతలు తమ పంటలను కేవలం రాష్ట్రపరిధిలో మాత్రమే విక్రయించుకోవాలని... ఇతర రాష్ట్రాలకు తరలించరాదనే ఆంక్షలు విధించడం సిగ్గుచేటన్నారు. ఎమ్మిగనూరు నుంచి జేపీ ప్రారంభించిన రైతు సత్యాగ్రహ యాత్ర రాత్రికి మంత్రాలయం చేరుకుంది. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి ఆయన మాట్లాడారు. మూడు బస్తాలకు మించి పక్క రాష్ట్రాల మార్కెట్లలో బియ్యం విక్రయిస్తే క్రిమినల్ కేసులు పెడతామని సర్కారు బెదిరిస్తే... బెదిరిపోయి వెనకడుగు వేసే ప్రసక్తేలేదని తేల్చిచెప్పారు. దేశవ్యాప్త మార్కెట్‌ను అన్నదాతలకు కేంద్రమే జోవో ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చిందని, దీన్ని ఉల్లంఘించిన రాష్ట్రప్రభుత్వంపైనే పోలీసులు కేసులు నమోదు చేయాలని డిమాండు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మంత్రాలయం నియోజకవర్గం నేత వై.ప్రదీప్‌రెడ్డి... జేపీని కలిసి రైతు సత్యాగ్రహానికి మద్దతును ప్రకటించారు. జేపీ యాత్ర మధ్యాహ్నం కర్ణాటకలోని గిలకసుగూరుకు చేరింది. ఆయన తీసుకెళ్లిన ఐదు క్వింటాళ్ల బియ్యాన్ని రాజ్యలక్ష్మి అనే మహిళ రూ. లక్షకు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో లోక్‌సత్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటారి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శులు ఓంకార్, బండారు రామ్మోహన్‌రావు, ఉపాధ్యక్షులు బాబ్జీ, జిల్లా కో-కన్వీనర్ దేవిడ్, మంత్రాలయం నియోజకవర్గ లోక్‌సత్తా పార్టీ ఇన్‌చార్జి సుబ్రమణ్యం శర్మ, డాక్టర్ సుందరరావు, రైతు సంఘాల నేతలు బోసు, శంకర రెడ్డి, దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఇప్పటికైనా ఆంక్షల్ని రద్దుచేయాలి : లోక్‌సత్తా**

వ్యవసాయోత్పత్తుల అమ్మకంపై విధించిన ఆంక్షలను ప్రభుత్వం ఇప్పటికైనా రద్దుచేస్తున్నట్టు అధికారికంగా ప్రకటించాలని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు డి.వి.వి.యస్. వర్మ డిమాండ్ చేశారు. ❑

# రైతులను ఆదుకోని చట్టాలెందుకు

**ఎక్కడైనా పంట విక్రయించే స్వేచ్ఛ ఉండాలి**

**ప్రభుత్వమే చట్టాన్ని ఉల్లంఘిస్తోంది**

**రైతు సత్యాగ్రహ యాత్రలో జేపీ ధ్వజం**

**రాష్ట్ర సరిహద్దులు దాటించి కర్ణాటకలో బియ్యం విక్రయం**

**ఎమ్మిగనూరు :** వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడంలో రాష్ట్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందని లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను ఆదుకోని చట్టాలు ఎందుకంటూ యాత్రలో భాగంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర బియ్యాన్ని సరిహద్దులు దాటించారు. కర్ణాటకలోని గిల్కసూగూరు క్యాంపులో దాన్ని విక్రయించి దమ్ముంటే అరెస్టు చేయండంటూ ప్రభుత్వానికి జేపీ సవాల్ విసిరారు. రెండు రోజులుగా 36 కి.మీ సాగిన పాదయాత్ర ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. రెండోరోజు కర్నూలు జిల్లా మంత్రాలయం నుంచి మొదలైన జేపీ పాదయాత్ర చెట్నేహళ్లి, మీదుగా మాధవరం చేరుకుంది. ఇక్కడి సరిహద్దు చెక్‌పోస్టు నుంచి బియ్యం మూటలను భుజాలపై వేసుకొని జేపీతో పాటు లోక్‌సత్తా పార్టీ నేతలు, కార్యకర్తలు తుంగభద్ర నదిని దాటారు. ఎడ్లబండ్లతోనూ బియ్యాన్ని తరలించారు. ఈ సందర్భంగా జేపీని అరెస్టు చేస్తారేమోనన్న ఉత్కంఠ నెలకొన్నప్పటికీ అలాంటిదేమీ చోటుచేసుకోలేదు. కర్ణాటకలోకి ప్రవేశించిన జేపీ బృందానికి అక్కడి పార్టీ నేతలు, కార్యకర్తలు, రైతులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గిల్కసూగూరు క్యాంపు వద్ద ఆంధ్రా నుండి తరలించిన ఐదు క్వింటాళ్ల బియ్యానికి జేపీ ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. 12 వేల రూపాయల విలువైన ఆ బియ్యాన్ని బెంగుళూరుకు చెందిన రామలక్ష్మి లక్ష రూపాయలకు దక్కించుకున్నారు. ❑

# స్పెక్ట్రమ్... సర్వజనుల సొత్తే

-గురుచరణ్‌దాస్

2జీ కుంభయకోణంపై ఇటీవల వెలువడిన సుప్రీంకోర్టు తీర్పు అధికార పక్షానికి శరాఘాతమే. 2008లో 122 మొబైల్ ఫోన్ కంపెనీలకు తప్పుడు మార్గంలో ఇచ్చిన స్పెక్ట్రమ్ లైసెన్సుల్ని రద్దు చేస్తూ వెలువరించిన తీర్పు నిజంగా చెంపపెట్టులాంటిదే. అయితే ఈ తీర్పుతో టెలికం పరిశ్రమ గందరగోళంలో పడిపోయింది. ప్రభుత్వ నిర్ణయ ప్రక్రియలో అవినీతి మకిలి తేలటంతో ప్రపంచం దృష్టిలో మరీ ముఖ్యంగా విదేశీ పెట్టుబడిదారుల దృష్టిలో మరీ ముఖ్యంగా వీదేశీ పెట్టుబడిదారుల దృష్టిలో దేశం పరువు దిగజారింది. మనదేశంలో మాత్రం న్యాయం గెలిచిందనే కారణంగా తీర్పుపై సంతోషం వ్యక్తమైంది.

అక్రమంగా పొందిన 2జీ స్పెక్ట్రమ్‌ను వేలం వేయల్సిందిగా భారత టెలికం నియంత్రణ ప్రాధికార సంస్థ (ట్రాయ్)ను ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ఆదేశించింది. "సహజ వనరులను బదిలీ చేసేటప్పుడు, కేటాయించేటప్పుడు వేలం పద్ధతినే అనుసరిస్తూ విస్తృతంగా ప్రచారం చేయాలి. దీనివల్ల అర్హులందరూ పాల్గొంటారు" అని తన తీర్పులో పేర్కొంది. కొరతగా ఉండే వనరుల్ని కేటాయించడంలో తొలుత విధానానికి మధ్యలోనే మంగళంపాడి, నిబంధనల్ని మార్చివేసి... పారదర్శకతకు పాతరేసి స్పెక్ట్రమ్ కేటాయింపులు చేపట్టారు. అదికూడా 2001 నాటి ధరలతో ఫలితంగా భారతదేశంలోనే అతిపెద్ద అవినీతి కుంభకోణం చోటచేసుకుంది.

ఇంతకీ.. స్పెక్ట్రమ్‌ను కేటాయించేందుకు వేలం పద్ధతి సరైనదేనా! అది కొరతగా ఉన్నంత మాత్రాన, దానిని డబ్బులు దండుకునే పరికరంలా ప్రభుత్వం ఉపయోగించుకోవచ్చా? నీరు కొరతగానే ఉంది. అలాగని.. వేలం వేయవచ్చా? లేదుకదా. వేలం ప్రక్రియలోనూ ఇబ్బందులు ఉన్నాయి. వేలంలో పారిశ్రామికవేత్తలు.. పోటీపడి అత్యధిక బిడ్లు వేస్తారు. ఆ ప్రభావం టారిఫ్‌లు, ధరల రూపంలో ప్రతిబింబిస్తుంది. ఫలితం పేదలకు మార్కెట్‌లో చోటులేని పరిస్థితి ఏర్పడుతుంది. ప్రపంచంలో 31 దేశాలు స్పెక్ట్రమ్‌ను వేలం వేసినా... ఆ తర్వాత ఇలాంటి ఫలితాలతో, బాధపడ్డాయి. అత్యంత తక్కువ టారిఫ్‌లతో భారత్ ప్రపంచంలోనే విజయవంతంగా నడుస్తున్న టెలికం మార్కెట్. మన మార్కెట్‌లోని అత్యధిక వినియోగదారులు పేదలే. ఈ ఘనత గత ప్రభుత్వానికే చెందుతుంది. ఎందుకంటే.. గత ప్రభుత్వం అత్యధిక స్థాయిలో ఉండే లైసెన్సు ఫీజుల విధానాన్ని మార్చివేసి, ప్రభుత్వానికి, టెలిఫోన్ కంపెనీకి మధ్య రాబడిన పంచుకునే పద్ధతికి శ్రీకారం చుట్టే ధైర్యం చేసింద. ఒకవేళ ఆ ప్రభుత్వం వేలం పద్ధతికే బలంగా కట్టుబడి ఉంటే ఈ రోజు సెల్‌ఫోన్లు పేదల చేతికి చేరి ఉండేవే కాదు.

ఆదర్శ ప్రపంచంలో రేడియో స్పెక్ట్రమ్ సూర్యరశ్మి లాంటిది. దానిపై ఎవరికీ, ఏ ప్రభుత్వానికీ యాజమాన్య హక్కులుండవు, అందరూ ఉచితంగానే పొందుతారు. సూర్యరశ్మిలా కాకుండా స్పెక్ట్రమ్ కొరతగా ఉండే వనరు కావడంతో చారిత్రకంగా ప్రభుత్వాలే నియంత్రిస్తూ వస్తున్నాయి. ప్రభుత్వాల కేటాయింపులు అసమర్థంగా ఉండటంతో అవినీతికి దారి తీస్తున్నాయనేది అందరూ అంగీకరించే వాస్తవం. స్పెక్ట్రమ్ అనేది గ్రామాల్లో సార్వజనీన అవసరాల కోసం ఉండే మేతమైదానంలాంటిదనీ, ప్రతి ఒక్కరూ ఉచితంగా వాడుకునేలా ఉండాలనేది ప్రస్తుత కాలంలో చాలామంది నిపుణుల అభిప్రాయం. స్పెక్ట్రమ్‌ను పంచుకునే సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాల అందుబాటు వల్ల అపరిమిత సంఖ్యలోని వ్యక్తులు, మధ్యలో ఎలాంటి అటంకాలు లేకుండా దీనిని వాడుకోవచ్చు. దీనివల్ల మేధోపర హక్కులు, సర్కారు నియంత్రణ వంటి సమస్యలూ తలెత్తవు. ఈ విషయంలో అమెరికా ఓ అడుగు ముందుకే... 3650 మెగాహర్జ్ బ్యాండులో 50 మెగాహర్జ్ స్పెక్ట్రమ్‌ను అందరూ వాడుకునేందుకు సార్వజనీన ఉమ్మడి కోటాలో ఉంచింది.

స్పెక్ట్రమ్‌ను అందిరికీ చెందేలా సార్వజనీన సొత్తులా మారిస్తే. ఎవ్వరూ దానిని సొంతం చేసుకోరు, వేలం వేసే అవసరమే ఉండదు. ఓ టెలికం కంపెనీ, నిర్దిష్ట ప్రాధికార వ్యవస్థ వద్ద రిజిస్టర్ చేసుకుంటే, దానికి స్పెక్ట్రమ్ ఫ్రీక్వెన్సీని

కేటాయిస్తుంది. సదరు కంపెనీ స్పెక్ట్రమ్‌ను ఉపయోగించుకోవడంలో గరిష్ఠ స్థాయిని చేరితే, ప్రాధికార వ్యవస్థ మరికొంత స్పెక్ట్రమ్‌ను విడుదల చేస్తుంది. ఓ గ్రామంలోని ఉమ్మడి మేతమైదానంలో ఎన్ని ఆవులు మేశాయనే ఆధారంగా రైతు నామమాత్ర రుసుమును ఎలాగైతే చెల్లిస్తారో.. అదేవిధంగా ప్రతిసెల్‌ఫోన్ వినియోగదారుడు కొంత నామామాత్ర రుసుము (ఉదా:నిమిషానికి పైసా) చెల్లించడం ద్వారా స్పెక్ట్రమ్ వ్యయాన్ని భరించవచ్చు. దీనిని నెలసరి బిల్లు రూపంలో వసూలు చేసుకునే టెలిఫోన్ కంపెనీ ప్రాధికార వ్యవస్థకు బదిలీ చేయవచ్చు. ఆవులు ఎక్కువెక్కువ మేత మేయకుండా గ్రామంలో కట్టుబాట్లు ఉన్నట్టే.. స్పెక్ట్రమ్ విషయంలోనూ నిబంధనలు చేయవచ్చు. ఈ నిబంధనలు పారదర్శకంగా, పర్యవేక్షణలో ఉండి, ఎవ్వరూ దుర్వినియోగం చేయకుండా చూడాలి. దురదృష్టవశాత్తూ.. సుప్రీంకోర్టు తీర్పు వేలం పద్ధతినే సమర్థిస్తూ వెలువడటంతో భవిష్యత్తు ప్రభుత్వాలు ఇంతకన్నా మెరుగైన ప్రత్యామ్నాయాల వైపు ఆలోచించేందుకు వెనకంజవేస్తాయి. సాంకేతిక పరిజ్ఞానం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుండటంతో త్వరలోనే 'ఓపెన్ స్పెక్ట్రమ్' కాలానికి ప్రపంచం సంసిద్ధమవ్వాలి.

సుప్రీంకోర్టు కొత్త లైసెన్సులను నాటకీయంగా రద్దుచేయడంతో ఇప్పుడు మార్కెట్ మొత్తం కొన్ని పెద్ద కంపెనీల చుట్టూ చేరాల్సి వస్తోంది. ఇది ఆరోగ్యర పరిణామమేనా? భారత మార్కెట్ ఎక్కడికక్కడ విడిపడిఉంది. చాలామేర టెలికం కంపెనీలు డబ్బులు నష్టపోతున్నాయి. వేగంగా పురుగుతున్న విపరీతమైన పోటీ నెలకొన్న భారత మార్కెట్ విషయంలో చిన్న కంపెనీలు, అదృష్టంలేని పోటీదారులు పునరాలోచించుకునే పరిస్థితులు ఉన్నాయి. భారీ సంస్థలైన ఎయిర్‌టెల్, వోడాఫోన్, ఐడియా, రిలయన్స్, టాటాలు సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న సంఘటిత వ్యూహంలో భాగంగా మార్కెట్‌లో వాటాను గెలుచుకునేందుకు అవకాశం కోసం చూస్తున్నాయి. ఓ శుభవార్త ఏమిటంటే... దేశీయ వినియోగదారులు పెద్దగా దెబ్బతినడం లేదు. నంబర్ పోర్టబులిటీ పద్ధతి రావటంతో కంపెనీలు మారడమూ తేలికైంది. అశుభవార్త ఏమిటంటే... సుప్రీంకోర్టు తీర్పు అంతర్జాతీయ పెట్టుబడిదారుల మనసుల్లో అనిశ్చితిని నింపింది. ఇది భారత్‌లో చపలచిత్త, ఊహకందని, అనిశ్చితిని సృష్టించే ప్రభుత్వాలు ఉంటాయనే నమ్మకాన్ని మరోసారి బలపరిచేలా ఉంది. భారత గౌరవానికి ఇదెంత మాత్రం మంచిది కాదు. ఇటీవలి పరిణామాల్లో దారుణంగా దెబ్బతిన్న నార్వే-టెలినార్, రష్యా-సిస్టెమా, యూఏఈ-ఎటిసలాట్ వంటి విదేశీ కంపెనీలు ఆగ్రహంగా ఉన్నాయి. ముఖ్యంగా టెలినార్... స్థిరాస్తి కంపెనీ యూనిటెక్ సంయుక్త భాగస్వామ్యంతో రూ॥12 వేల కోట్లు పెట్టుబడిగా పెట్టింది. మిగతా కొత్త కంపెనీల మాదిరిగా కాకుండా టెలినార్ వ్యాపారం పరిమాణం పెరగడంతోపాటు, 3.6 కోట్ల వినియోగదారులతో మార్కెట్ వాటాలోనూ వృద్ధి సాధించింది. ఈ నేపథ్యంతో పోరాడతామంటూ టెలినార్ ప్రకటించింది. భారత మార్కెట్‌లో ఉండాలంటే రాబోయే వేలంలో చెల్లించాల్సిన వ్యయం గురించే ప్రస్తుతం ఆ కంపెనీ ఆందోళన చెందుతోంది. ❑

(ఈనాడు సౌజన్యంతో...)



# రైతులను తీవ్ర నిరాశపరిచిన రాష్ట్ర బడ్జెట్

## - డా॥ జయప్రకాష్ నారాయణ్

ఎంత తక్కువ కేటాయింపులు చేస్తే ఆ రంగానికి అన్ని ఎక్కువ పేజీలు కేటాయించి బడ్జెట్‌లో మాయచేయటం ఆనవాయితీ అని చెబుతుంటారని, రాష్ట్రంలో అత్యంత సంక్షోభంలో ఉన్న వ్యవసాయరంగానికి 2012-13 రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం అదే సూత్రాన్ని వర్తింపచేసి రైతులను తీవ్రనిరాశకు గురిచేసిందని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ నిశితంగా విమర్శించారు. దేశంలో ఎక్కడాలేని రీతిలో మన రాష్ట్రంలో వ్యవసాయోత్పత్తుల మీద ఉన్న పన్నుల్ని తగ్గించైనా రైతులకు కొంత ఉపశమనం కల్పిస్తారని ఆశించామని, అయితే రైతుల్ని అయినకాడికి అణగదొక్కటమే ధ్యేయమన్నట్టు రైతుల మీద అన్యాయపు పన్నుల భారాన్ని అదేరీతిలో కొనసాగించారన్నారు. వ్యవసాయాన్ని లాభసాటి చేయటానికి ఒక్కటంటే ఒక్క ఏర్పాటును, విధానపరమైన మార్పుల్ని బడ్జెట్‌లో ప్రతిపాదించలేదని, వ్యవసాయ సేవలు అందించే విభాగాలు పూర్తిగా నిర్వీర్యమైపోయినా వాటిని పటిష్టపరిచే దిశగా కూడా ప్రభుత్వం పైసా కూడా కేటాయించలేదని అన్నారు. విధానాలలో మార్పు తేకుండా వ్యవసాయాన్ని బాగుచేయటం అసాధ్యమన్నారు. అలాగే విద్య, ఆరోగ్యం,బడ్జెట్‌లో కేటాయింపులు అరకొరగా ఉన్నాయని, స్థానిక ప్రభుత్వాలకు నిధుల కేటాయింపు కొండను తవ్వి ఎలకను పట్టినట్టుందితప్ప వాటి సాధికారతకు కావలసిన స్థాయిలో వందోవంతు కూడా లేవన్నారు. జలయజ్ఞం ఖర్చు భారీగా పెరిగి ఆయకట్టు గత సంవత్సరం కంటే తగ్గిందని, అబద్ధాలతో ఆ వాస్తవాల్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారన్నారు. బీదల్ని సర్వనాశనం చేస్తూ రాజకీయాల్ని భ్రష్టుపట్టిస్తున్న మద్యం విధానంలో మార్పు ప్రస్తావనే లేదన్నారు.



## బడ్జెట్ సమగ్ర స్వరూపం

**బడ్జెట్ మొత్తం– రూ.1,45,854 కోట్లు**
**(2011–12 బడ్జెట్ అంచనాల కన్నా 14% ఎక్కువ)**

| | |
|---|---|
| ప్రణాళికేతర వ్యయం | 91,824 |
| ప్రణాళికా వ్యయం | 54,030 |
| (ఇందులో కేంద్ర ప్రాయోజిత పథకాల మొత్తం 5,080) | |
| రెవెన్యూ వసూళ్లు | 1,16,786 |
| (2011–12 అంచనాల కన్నా 16% ఎక్కువ) | |
| ఇందులో.. | |
| ★ కేంద్ర పన్నుల వాటా | 21,965 |
| ★ కేంద్ర పథకాలు, గ్రాంట్లు | 14,949 |
| రాష్ట్ర పన్ను రాబడి | 66,021 |
| ఈ పన్నుల్లో... | |
| ★ అమ్మకపు పన్ను | 45,000 |
| ★ ఎక్సైజ్ | 10,820 |
| ★ మోటారు వాహనాల పన్ను | 3,640 |
| ★ స్టాంపులు, రిజిస్ట్రేషన్లు | 4,968 |
| రాష్ట్ర పన్నేతర రాబడి | 13,852 |
| ఇందులో... | |
| గనులు, ఖనిజాల ద్వారా | 2,733 |
| రెవెన్యూ వ్యయం | 1,12,342 |
| ఇందులో... | |
| ప్రణాళికేతర | 82,235 |
| ప్రణాళిక | 30,107 |
| రెవెన్యూ మిగులు | 4,444 |
| (2012–13 బడ్జెట్ అంచనాల్లో) | |
| మూల ధన పెట్టుబడి, రుణాల చెల్లింపులపై మొత్తం వ్యయం | 23,922 |
| ద్రవ్యలోటు | 20,009 |
| (2012–13 బడ్జెట్ అంచనాల్లో) | |
| (జీఎస్‌డీపీలో 2.58%) | |
| రాష్ట్ర స్థూల ఉత్పత్తి(జీఎస్‌డీపీ) | 7,74,288 |
| మొత్తం అప్పులు | 1,60,191 |

శాసనసభలో ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ 2012–13 వార్షిక బడ్జెట్‌పై జేపీ స్పందిస్తూ... జాతీయస్థాయి ప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వం తర్వాత అంత కీలకమైనది మూడో అంచెలో ఉన్న స్థానిక ప్రభుత్వమని, అలాంటిది రూ. 1,45,954 కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం సుమారు రూ. 670 కోట్లు కేటాయించటం సిగ్గుచేటన్నారు. స్థానికంగా ప్రజలకు రోజువారీ పనులు సక్రమంగా జరగక పాలన అస్తవ్యస్తంగా ఉందని, స్థానిక ప్రభుత్వాలకు సకాలంలో ఎన్నికలు జరిపి, పూర్తిగా అధికారాల్ని, నిధుల్ని పూర్తిస్థాయిలో కేటాయించి అక్కడ తప్పు జరిగితే చర్యలు తీసుకునేందుకు పైస్థాయిలో నిర్దిష్ట ఏర్పాట్లు చేయాల్సిందన్నారు. అలాగే విద్య, ఆరోగ్యం రంగాలకు కేటాయింపులు పెంచామని చెప్పుకున్నారని, అయితే ఇప్పటికీ జాతీయస్థాయి సగటుకన్నా ఆ రంగాలలో దాదాపు 5, 0.6 శాతం మేర వెనకబడి ఉన్నామన్నారు. విద్యారంగంలో రాష్ట్రం దక్షిణాదిరాష్ట్రాలలోనే అథమస్థానంలో ఉందని, జాతీయస్థాయిలో ఒక్క జార్ఖండ్ మాత్రమే మనకంటే వెనక ఉందని, అందువల్ల కేటాయింపులతోపాటు వాటి ద్వారా సాధిస్తున్న ఫలితాలపై నిర్దిష్టంగా 'ఔట్‌కం బడ్జెట్'ను వెలువరించాల్సి ఉందన్నారు.

ప్రభుత్వ అసమర్థ, మూర్ఖ విధానాల వల్ల విద్యుత్ కొరత ఏర్పడి, ఆర్థికప్రగతి దెబ్బతింటోందని, ప్రజలు తీవ్ర అవస్థలకు గురవుతున్నారని, ఆ విధానంలో మౌలికమార్పులేవీ ప్రతిపాదించలేదని జేపీ అన్నారు. గుజరాత్‌లో 24 గంటలూ గ్రామాలకు విద్యుత్‌నిస్తుంటే కనీసం ఒక లక్ష్యంగా కూడా ఆ అంశాన్ని బడ్జెట్‌లో చేర్చే సాహసాన్ని, దూరదృష్టిని ప్రభుత్వం ప్రదర్శించలేకపోయిందన్నారు. గనుల లీజులలో అవినీతి, ఆశ్రితపక్షపాతంతో వేలకోట్లు దోచుకున్నారని తెలిసినా, అలాంటి లీజుల్ని రద్దుచేసి ప్రకృతి వనరుల కేటాయింపులను వేలంపాటల ద్వారా పారదర్శకంగా కేటాయించాలని ఇటీవల 2జీ స్పెక్ట్రంపై సుప్రీంకోర్టు తీర్పునిచ్చినా, ఆ దిశగా చర్యలను, విధానపరమైన మార్పుల్ని ఆలోచన చేయలేదన్నారు. మెట్రోరైలు అంచనాల గురించి చెప్పారని, అయితే లింకురోడ్లు లేకుండా మెట్రోనిర్మాణం చేపట్టటం వల్ల హైదరాబాద్ ప్రజలు నరకాన్ని చవిచూస్తున్నారని, లింకురోడ్ల నిర్మాణం గురించిన ప్రస్తావన లేదన్నారు. ప్రకాశం జిల్లాలో తాను కలెక్టర్‌గా ఉన్నప్పుడు కేవలం రెండు సంవత్సరాల కాలంలో 42కోట్ల వ్యయంతో 2

| ప్రణాళికేతర వ్యయం కింద ఖర్చు (రూ.కోట్లలో) | | |
|---|---|---|
| అంశం | 2011–12 | 2012–13 |
| వేతనాలు | 27,131 | 30,598 |
| వడ్డీ చెల్లింపులు | 11,437 | 12,226 |
| రుణాల తిరిగి చెల్లింపులు | 9,710 | 8,813 |
| పింఛన్లు | 9,693 | 11,480 |
| వేతనేతర ఖర్చు | 3,112 | 3,497 |
| నిర్వహణ | 1,527 | 1,797 |
| రుణాలు, అడ్వాన్సులు | 123 | 775 |
| బియ్యం రాయితీలు | 2,500 | 3,000 |
| విద్యుత్ రాయితీలు | 4,300 | 5,500 |
| ఉపకారవేతనాలు | 498 | --- |
| ఇతర | 8,478 | 9,943 |

లక్షల ఎకరాలను సాగులోకి తేగలిగానని, అదే ఈవేళ జలయజ్ఞంలో ఎకరా సాగుఖర్చు సుమారు రూ.5లక్షలకు పెరిగిందని, కేవలం కాంట్రాక్టర్లకు వేలకోట్లు దోచిపెట్టటానికి తప్ప రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధికీ జలవనరుల్ని సద్వినియోగం చేసే దిశగా ఆ జలయజ్ఞం లేదని, అందుకే అన్ని వేలకోట్లు కేటాయించిన ఆ అంశం గురించి కేవలం ఒక్క పేరాతో సరిపెట్టేశారన్నారు. తట్టమన్ను తీయకుండా ఒక్క ఇటుక పేర్చకుండా ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు మొబిలిజేషన్ అడ్వాన్స్ పేరుతో రూ.1000 కోట్లు కేటాయించిన పేరుమోసిన ఉదాహరణను ఆయన గుర్తుచేశారు.

కేంద్రప్రభుత్వ నిధుల వినియోగంలో కూడా తీవ్ర వైఫల్యం కనిపిస్తోందని జేపీ ఆవేదన వెలిబుచ్చారు. ''పాఠశాల విద్యలో రాష్ట్రం వాటాని విడుదల చేయకపోవటంతో సర్వశిక్షా అభియాన్, మాధ్యమిక శిక్షా అభియాన్ నిధులు వృధాగా పోతున్నాయి. అలాగే లోక్‌సత్తా చేసిన ప్రయత్నంతో జాతీయస్థాయిలో స్థానిక న్యాయాలయాల (గ్రామన్యాయాలయాల) చట్టం వచ్చి మూడేళ్లయినా, మండలాలలో కోర్టుల ఏర్పాటుకి కేంద్రప్రభుత్వ నిధులున్నా ఆ కోర్టుల ఏర్పాటు ప్రస్తావనే లేదు. బీదలకి ఆరోగ్యబీమా కోసం రాష్ట్రీయ స్వాస్థ్ బీమా యోజన ఉన్నా ఒక్క రూపాయి కూడా అందుకు వినియోగించుకోని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మిగిలిపోయింది.

మద్యం మీద అత్యధికంగా ఏటా రూ.17,000 మేరకు ఆదాయాన్ని ఆర్జిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. మద్యం ప్రభావంతో లక్షలాది కుటుంబాలు సర్వనాశనమైపోతున్నా, అవినీతి అడుగడుగునా పాకినట్టు రోజూ వార్తలొస్తున్నా మద్యం విధానాన్ని గూర్చిన సమీక్షగానీ, ఆబ్కారీలో ఆదాయాన్ని కొంత కోల్పోయినా బీదప్రజలని కాపాడదామన్న సంకల్పంగానీ బడ్జెట్ ప్రసంగంలో చోటుచేసుకోకపోవటం బాధాకరం" అని జేపీ వ్యాఖ్యానించారు.

బడ్జెట్‌ను ఘనంగా 1,45,854 కోట్లుగా చెప్పారని, గతంలోలా కేటాయింపులలో 15–17శాతం కోత పడితే ఆ బడ్జెట్‌లో కనీసం రూ.23,000కోట్లు తగ్గుతాయని, బహుశా ఆ వాస్తవం చెప్పే ధైర్యంలేకే 42 పేజీలలో 91 పేరాలలో పొందుపరిచిన బడ్జెట్‌లో భారీ అంచనా లెక్కను కూడా కేవలం ఒక్క పేరాతో తేల్చేశారన్నారు.

మీసేవ ద్వారా అవినీతిలేకుండా వివిధ రకాల ధృవపత్రాలను నిర్ణీత కాలవ్యవధిలో ఇచ్చే ఏర్పాటును చిత్తశుద్ధితో అమలుచేస్తూ విస్తరిస్తే సామాన్య ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని జేపీ అభినందించారు. పట్టణాభివృద్ధికి రూ.6586 కోట్ల కేటాయింపును కూడా ఆయన స్వాగతించారు. కొన్ని సాంఘికసంక్షేమ హాస్టళ్లలో అనర్హులను గుర్తించటం వల్ల ప్రభుత్వానికి సుమారు రూ.30 కోట్లు ఆదా అయిందని తెలిపారని, ఇంత పెద్దబడ్జెట్‌లో అన్నిరంగాలలో అలాంటి శ్రద్ధ పెడితే వేలకోట్లను అవినీతిపరుల నుంచి ఆదా చేసుకోవచ్చన్నారు. ఒకపక్క అర్హులకు రేషన్ కార్డులు లేవని, మరోపక్క రాష్ట్ర జనాభాకంటే ఎక్కువ సంఖ్యలో కార్డులు అధికారికంగా ఉన్నాయని, రూ.1కి కిలోబియ్యం పథకంలో 50శాతం తిరిగి రీసైక్లింగ్‌కి వచ్చేస్తోందని, అవినీతికట్టడికి ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటేనే కేటాయింపుల మేరకైనా ప్రభుత్వం సత్ఫలితాలను సాధించగలుగుతుందని జయప్రకాష్ నారాయణ్ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. ❑

# జలయజ్ఞానికి బడ్జెట్ కేటాయింపులు



## ముఖ్య ప్రాజెక్టులకు కేటాయింపులు...

| ప్రాజెక్టు | 2011-12 కేటాయింపు | 2012 జనవరి వరకు చేసిన ఖర్చు | 2012-13 కేటాయింపు |
|---|---|---|---|
| ప్రాణహిత | 608.29 | 256.22 | 1050 |
| పోలవరం | 1000 | 452 | 850 |
| తాటిపూడి ఎత్తిపోతల | 75 | 14.71 | 61 |
| పుష్కరం | 40 | 23.19 | 47 |
| చింతలపూడి | 75 | 0 | 75 |
| వెంకటనగరం | 25 | 1.64 | 19 |
| ఉత్తరాంధ్ర సుజల స్రవంతి | 75 | 0 | 7 |
| భూపతిపాలెం | 30 | 9.1 | 12 |
| ముసురుమిల్లి | 20 | 11.5 | 16 |
| కల్వకుర్తి | 250 | 155 | 220 |
| భీమా | 260 | 77 | 175 |
| నెట్టెంపాడు | 233 | 75 | 144 |
| కోయల్‌సాగర్ | 60 | 36 | 45 |
| ఆర్డీఎస్ | 40 | 4 | 19 |
| జూరాల | 80 | 54 | 61 |
| సంగంబండ | 15 | 1.5 | 50 |
| ఎల్లంపల్లి | 455 | 416 | 360 |
| ఎస్సారెస్పీ2-వరద కాలువ | 250 | 185 | 410 |
| తుంగభద్ర ఎల్లెల్సీ | 20 | 13.18 | 18 |
| కెసి కెనాల్ | 60 | 25 | 75 |
| ఎస్సార్‌బీసీ | 70 | 115 | 125 |
| తుంగభద్ర హెచ్చెల్సీ స్టేజి-1 | 50 | 34.50 | 37.38 |
| తుంగభద్ర హెచ్చెల్సీ స్టేజి-2 | 110 | 42.18 | 66 |
| హంద్రీనీవా | 660 | 949 | 700 |
| గురురాఘవేంద్ర | 100 | 74.15 | 80 |
| వెలిగొండ | 545 | 420.84 | 600 |
| గుండ్లకమ్మ | 28 | 14 | 14 |
| కొరిసిపాడు ఎత్తిపోతల | 50 | 24 | 22 |
| ఎస్.ఎల్.బి.సి | 450 | 297 | 450 |
| సోమశిల | 140 | 65 | 230 |
| పెన్నా నది | 100 | 85 | 100 |
| తెలుగుగంగ | 180 | 145.33 | 160 |
| కడెం | 15 | 9.5 | 20 |
| ఎస్సారెస్పీ మొదటిదశ | 75 | 90 | 140 |
| ఎస్సారెస్పీ-2 | 205 | 16.5 | 75 |
| దేవాదుల | 1138 | 550 | 715 |
| రాజీవ్ దుమ్ముగూడెం | 150 | 133 | 150 |
| ఇందిరా దుమ్ముగూడెం | 150 | 18 | 137 |
| దుమ్ముగూడెం-టేల్‌పాండ్ | 200 | 0 | 40 |
| గాలేరు-నగరి | 540 | 277 | 420 |
| పిబిసి | 305 | 83 | 280 |
| మైలవరం | 20 | 10.20 | 15 |
| వంశధార మొదటిదశ | 20 | 0.025 | 10 |
| వంశధార ఫేజ్-2,స్టేజి-2 | 75 | 48.5 | 75 |
| తోటపల్లి | 40 | 32 | 48 |
| మహేంద్రతనయ | 35 | 0 | 34 |
| తారకరామతీర్థ | 25 | 5.5 | 30 |
| నాగార్జునసాగర్ ఆధునికీకరణ | 300 | 162 | 590.19 |
| నాగార్జునసాగర్ ప్రాజెక్టు | 110 | 75 | 85 |
| నిజాంసాగర్ | 150 | 51.5 | 200 |
| లెండి | 60 | 11.67 | 45 |
| సింగూరు | 25 | 25 | 36 |
| సి.ఇ గోదావరి డెల్టా | 120 | 60.5 | 299 |
| సి.ఇ కృష్ణాడెల్టా | 200 | 139 | 302 |
| పులిచింతల | 175 | 176 | 165 |
| కంతనపల్లి | 50 | 0.025 | 60 |
| కరకట్టలు | - | - | 270 |
| మధ్యతరహా నీటిపారుదల | 375 | 134 | 575.90 |
| చిన్ననీటిపారుదల | - | - | - |
| ఎపిఎస్ఐడిసి | 2080 | 957 | 2380.10 |

# బడ్జెట్... బలుపు కాదు వాపే!

**- కేంద్ర సౌజన్య పథకాలతో అంకెల గారడీ**

**- బడ్జెట్ బలిమికే వాడుకుంటున్న సర్కారు**

**- ఏడేళ్లలో సగానికి సగం ఖర్చులో కోత..**

**- వాటిని కుదించాలంటూ కేంద్రానికి లేఖ**

'వాపును' చూపి బలుపుగా నిమ్మిస్తోంది మన రాష్ట్ర ప్రభుత్వం... నిజం! దాదాపు లక్షన్నర కోట్ల బడ్జెట్ అంకెల్లో చాలా వరకు బొంకులే. కేంద్ర సౌజన్య పథకాలతో అంకెలను పెంచడమే ఇందుకు నిదర్శనం. పైగా వాటిని సమర్థంగా వినియోగించుకొనే సత్తా కొరవడ్డ ప్రభుత్వం ఇప్పుడు వాటి సంఖ్యను బాగా తగ్గించాల్సిందిగా కేంద్రంపై వత్తిడి తెస్తోంది.

| అప్పులు - చెల్లింపులు (2011, మార్చినాటికి రూ.కోట్లలో) | | |
|---|---|---|
| పరిపక్వవ్యవధి | అప్పు | శాతం |
| 0-1 | 4,740 | 4.99 |
| 0-3 | 11,235 | 11.82 |
| 3-5 | 9,985 | 10.52 |
| 5-7 | 13,316 | 14.00 |
| ఏడు, ఆ తరవాత | 55,783 | 58.67 |
| మొత్తం | 95.072 | 100.00 |

నిజానికి మన రాష్ట్ర బడ్జెట్ అంకెలు అంత భారీగా ఉండడానికి కేంద్ర పథకాల కింద విపరీతంగా అంచనాలు చూపించడం కూడా ఓ కారణమనే చెప్పాలి. మొన్నటికి మొన్న కొత్త బడ్జెట్‌లో కూడా ఇలా రూ॥5 వేల కోట్లను చూపించింది. గత ఏడేళ్ల వ్యవధిలో ఇదే మాదిరిగా భారీగా నిధులను పొందుపర్చింది. కాని వాటిలో 48.86 శాతం మేర ఖర్చుపెట్టలేక చేతులెత్తేసింది. వివిధ రంగాలకు సంబంధించి ప్రస్తుతం 147 కేంద్ర సౌజన్య పథకాలు (సీఎస్ఎస్) అమల్లో ఉన్నాయి. రాష్ట్రం తన సొంత నిధులతో రూపొందించే వార్షిక ప్రణాళికకు ఇలా కేంద్ర పథకాల నిధులను కూడా జోడించి ఆ రెండింటి మొత్తాన్ని బడ్జెట్‌లో ప్రణాళిక కేటాయింపుగా చూపిస్తుంది. ఈ పథకాల్లో చాలావాటికి రాష్ట్రం కొంత వాటాను సమకూర్చాల్సి ఉంటుంది.

కేంద్రం వాటాలను రాష్ట్రం ఏటా భారీగా అంచనావేయటం పరిపాటయింది. తాజా బడ్జెట్‌లో రూ॥5,096 కోట్లను ఇలా పొందుపర్చింది. దీంతో రూ॥48,934 కోట్ల వార్షిక ప్రణాళికకు ఈ నిధులు కూడా కలసి బడ్జెట్‌లో ప్రణాళిక కేటాయింపు రూ॥54.030 కోట్లకు చేరింది. రాష్ట్రం ఏటా ఇలా నిధులు చూపించటమే తప్ప వాటిని కేంద్రం నుంచి పొందటంలోను, పొందిన వాటిని సకాలంలో ఖర్చుపెట్టంలోనూ చిత్తశుద్ధి కనబరచడంలేదు. సరిగ్గా ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర సౌజన్య పథకాలను 59కి తగ్గించాలంటూ చతుర్వేది కమిటీ సిఫార్సు చేసింది. 'రోగి కోరింది... వైద్యుడు ఇచ్చింది ఒకటే' అన్నట్లు రాష్ట్రానికి ఆ మాట ఎంతో నచ్చేసింది. వెంటనే దాన్ని అమలు చేయాలంటూ కేంద్రానికి సూచించింది.

ఎందుకంటే పథకాలు విలీనమైనా నిధులు మాత్రం తగ్గబోవు. వాటి కుదింపుతో పర్యవేక్షణ బాధ్యతలు మాత్రం బాగా తగ్గుతాయి. ప్రస్తుతం పర్యవేక్షణే రాష్ట్ర సర్కారుకు పెద్ద సమస్యగా ఉంది. అందుకే కమిటీ సిఫార్సు ఎంతో తొందరగా అమలైతే తనకంత సౌలభ్యమని భావిస్తోంది. రాష్ట్రం 2004-05 నుంచి 2010-11 వరకు ఏడేళ్ల బడ్జెట్లలో కేంద్ర సౌజన్య పథకాల ద్వారా రూ॥21,333 కోట్లను చూపించి కేవలం రూ॥11,336 కోట్లను మాత్రమే ఖర్చు పెట్టగలిగింది. మిగతా రూ॥9,997 కోట్లకు (66.86శాతం) కోత పడింది. ❑

| కేంద్ర పథకాల కింద రాష్ట్రం అంచనా, ఖర్చు ఇలా ఉన్నాయి (రూ॥కోట్లలో) | | | |
|---|---|---|---|
| సంవత్సరం | బడ్జెట్ అంచనా | ఖర్చు | కోత |
| 2006-07 | 3,352 | 1,405 | 1,947 |
| 2007-08 | 2,473 | 1,817 | 656 |
| 2008-09 | 4,551 | 2,083 | 2,468 |
| 2009-10 | 3,384 | 1,620 | 1,764 |
| 2010-11 | 3,513 | 2,457 | 1,056 |

## అప్పుల ఊబిలో ఆంధ్రప్రదేశ్

| | | |
|---|---|---|
| తీసుకురావల్సిన కొత్త అప్పులు | : | రూ.20వేల కోట్లు |
| అప్పులపై కట్టాల్సిన వడ్డీ | : | రూ.12.226 కోట్లు |
| 2004 నాటికి ఉన్న అప్పులు | : | రూ.58,770 కోట్లు |
| 2011-12 నాటికి రుణభారం | : | రూ.లక్షా65 వేలకోట్లు |
| 2012-13 నాటికి పూచీకత్తుతో కలిపి | : | రూ.లక్షా86 వేలకోట్లు |
| 2004-05నుంచి వడ్డీలుగా కట్టింది | : | రూ.67,570 కోట్లు |

# రైల్వేల అభివృద్ధికి 5.6 లక్షల కోట్లు అవసరం

## శ్యాంపిట్రోడా కమిటీ సిఫార్సు

వచ్చే అయిదేళ్లలో భారతీయ రైల్వేను సమూలంగా ఆధునికీకరించాలంటే తక్షణం రూ॥ 5.60 లక్షల కోట్లు కావాలని శ్యాంపిట్రోడా కమిటీ పేర్కొంది. చూడటానికి ఈ మొత్తం పెద్దగా కనిపించినా ప్రభుత్వం తలచుకుంటే ఇదేమీ అసాధ్యం కాబోదని స్పష్టం చేసింది. రైల్వే రంగానికి మొత్తం రూ॥10 లక్షల కోట్ల పెట్టుబడులు అవసరం ఉందని తెలిపింది. 12వ పంచవర్ష ప్రణాళిక కాలంలో రూ॥9.39 లక్షల కోట్లు కావాల్సి ఉందని పేర్కొంది. రైల్వేలోని 15 కీలకాంశాలపై దృష్టి సారించిన ఈ కమిటీ వ్యవస్థ ప్రక్షాళన మొత్తం 113 సిఫార్సులు చేసింది. హెచ్‌డీఎఫ్‌సీ ఛైర్మన్ దీపక్ పరేఖ్, ఎస్‌బీఐ మాజీ ఛైర్మన్ ఎమ్మెస్ వర్మ, అహ్మదాబాద్ ఐఐఎం ప్రొఫెసర్ జి.రఘునందన్, ఐడీఎఫ్‌సీ మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్‌లాల్, ఫీడ్‌బ్యాక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ వినాయక్ ఛటర్జీ, రైల్వే బోర్డు సలహాదారుడు రంజన్‌జైన్‌లతో గత ఏడాది సెప్టెంబర్ 21న ఏర్పడిన ఈ కమిటీ తమ నివేదికను రైల్వే మంత్రి దినేష్ త్రివేదీకి అందజేసింది. కమిటీ ఛైర్మన్ శ్యాంపిట్రోడాషి కాగోలో ఉండటంతో ఆయన అక్కడి నుంచే ప్రత్యక్ష ప్రసారం ద్వారా కమిటీ నివేదికను వివరించారు. 21వ శతాబ్దంలో దేశ ఆర్థిక, సామాజిక అవసరాలను అందుకోవాలంటే రైల్వేను ఆధునికీకరించి దాని సామర్థ్యాన్ని పెంచాలని స్పష్టం చేసింది. దానివల్ల 12వ ప్రణాళికకు ఈ రంగం అదనంగా 1.5 నుంచి 2 శాతం జీడీపీ సమకూరుస్తుందని తెలిపింది.



## కమిటీ సిఫార్సుల్లో ముఖ్యమైనవి

♦ ఇప్పుడున్న 19వేల కిలోమీటర్ల ట్రాకను ఆధునీకరించాలి. 40 శాతం ట్రాక్‌తో 80 శాతం ట్రాఫిక్ అవసరాలు తీరుస్తున్న ఏ,బీ, డీ మార్గాలకు ఇందులో ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి. 25 టన్నుల యాక్సిల్ సామర్థ్యంతో గంటకు 75 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో గూడ్సురైళు ్లు పయనించేలా ఈ ట్రాక్‌ను తీర్చిదిద్దాలి. ఏ-బీ మార్గాల్లో ప్రయాణికులను తీసుకుళ్లే రైళ్లు 160 నుంచి 200 కిలోమీటర్ల వేగంతో పయనించేలా ఈ ట్రాక్‌ను తీర్చిదిద్దాలి. ఏ-బీ మార్గాల్లో ప్రయాణికులను తీసుకుళ్లే రైళ్లు 160 నుంచి 200 కిలోమీటర్ల వేగంతో పయనించేలా ట్రాక్‌ను పటిష్ఠపరచాలి. ఇందులో పిట్రోడా కమిటీ మొత్తం 24 మార్గాలను సిఫార్సు చేసింది. వాటిలో రాష్ట్రంలోని సికింద్రాబాద్-మన్మాడ్, సికింద్రాబాద్-డోన్, గూడురు-తిరుపతి-కాట్పాడి, ఖాజీపేట-సికింద్రాబాద్-వాడీ, ఖరగ్‌పూర్-విజయవాడ, గుంటూరు- నంద్యాల- గుంతకల్లు -బళ్లారి, నడికుడి-పడిపల్లి మర్గాలను చేర్చింది.

♦ వంతెనల నిర్మాణం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న లెవెల్‌క్రాసింగ్‌లన్నింటినీ నిర్మూలించాలి. ట్రాక్ పొడువునా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి. వంతెనల నిర్మాణానికి దాదాపు రూ॥4వేల కోట్లు అవసరం. అవుతుందని అంచనా, ఫెన్సింగ్‌కు పట్టణ ప్రాంతాల్లో కిలోమీటరుకు రూ॥40 లక్షలు, మిగతా చోట్ల రూ॥10 లక్షలు ఖర్చువుతుందని కమిటీ తేల్చింది.

♦ ఏ, బీ మార్గాల్లో అత్యంత నాణ్యమైన ట్రాక్ ఏర్పాటుచేసి దాని నిర్వహణనంతా పూర్తిగా యాంత్రీకరించాలి.

♦ అధిక బరువు, వేగాన్ని తట్టుకొనేవిధంగా 11,250 వంతెనలను బలోపేతం చేయాలి. ఏ,బీ,డీ మార్గాల్లో ఉన్న 11,250 వంతెనలను బలోపేతం చేయాలి. ఈ మొత్తం కార్యక్రమానికి రూ॥33.406 కోట్లు ఖర్చవుతుందని అంచనా.

♦ ఏ,బీ మార్గాల్లో ఆటోమేటిక్ బ్లాకింగ్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

♦ జీఎస్ఎం ఆధారిత మొబైల్ ట్రైన్ కంట్రోల్ కమ్యూనికేషన్ వ్యవస్థను ఏ,బీ మార్గాల్లో ప్రవేశపెట్టాలి.

♦ నూతన తరం లోకోమోటివ్స్ తీసుకురావాలి. ఎలెక్ట్రిక్ లోకోమోటివ్స్ 9 వేల నుంచి 12 వేల అశ్వశక్తితో, డిజిల్ లోకోమోటివ్స్ 5,500 అశ్వశక్తితో పరుగులు తీసేవిధంగా ఉండాలి.

♦ గంటకు 160 నుంచి 200 కిలోమీటర్ల వేగంతో పయనించే ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు ప్రవేశపెట్టాలి.

♦ దేశవ్యాప్తంగా ఉన్న 7083 స్టేషన్లలో 100 పెద్ద రైల్వేస్టేషన్లను తోక్షణం ఆధునికీకరించాలి. వచ్చే పదేళ్లలో 770 స్టేషన్లను పునరుద్ధరించాలి.

♦ రైల్వేస్టేషన్లు, టర్మినళ్లు, హైస్పీడ్ రైల్‌కారిడార్లు, ఎలివేటెడ్ రైల్‌కారిడార్, ప్రైవేట్ ఫ్రైట్ టెర్మినళ్లు, వ్యాగన్ల లీజ్, లోకో, కేచ్ తయారీ యూనిట్లు, సొంత విద్యుత్ ఉత్పత్తి, సౌర, పవన విద్యుత్తు ఉత్పత్తి రైల్వే ఆసుపత్రులు, స్కూళ్లలోకి ప్రైవేటు పెట్టుబడులు ఆహ్వానించాలి.

♦ దేశవ్యాప్తంగా వృథాగా పడివున్న రైల్వే భూమిని అభివృదిన్ధ చేయడం ద్వారా రూ॥50 వేల కోట్లు సమకూర్చుకొనే అవకాశం ఉంది. పట్టణప్రాంతాల్లో 10 వేల ఎకరాలను అభివృద్ధి చేయడం ద్వారా ఎకరాకు రూ॥5 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

♦ అహ్మదాబాద్- ముంబయి మధ్య గంటకు 350 కిలోమీటర్లతో నడిచే హైస్పీడ్ రైల్వేలైన్ నిర్మించాలి. హైదరాబాద్ -డోర్నకల్- విజయవాడ-చెన్నై మార్గాన్నీ ఇందుకోసం పరిశీలించాలి.

♦ ఐఐటీలో రైల్వే టెక్నాలజీ, ఐఐఎంలలో రైల్వే యాజమాన్యకోర్సులు ప్రవేశపెట్టాలి. ఇప్పుడున్న శిక్షణాసంస్థల పరిస్థితులను పునఃసమీక్షించి పునరుద్ధరించాలి.

♦ ఉద్యోగుల పనితీరు ఆధారంగా ప్రోత్సాహక వేతనం ఇవ్వాలి.

♦ రైల్వే బోర్డును వ్యవస్థాగతంగా, పనితీరుపరంగా సమూలంగా ప్రక్షాళించాలి. దాని చైర్మన్ సీఈఓను ప్రతిబింబించాలి.

♦ పెట్టుబడులపై నిర్ణయాలు తీసుకొనేవిధంగా రైల్వే జోన్లకు అధికారం ఇవ్వాలి. పెట్టుబడులపై వచ్చే లాభనష్టాలకు వారినే జవాబుదారీ చేయాలి. ❑

# జాతి నాయకుల్ని కులనాయకుల్ని చేయొద్దు

- మైత్రి



తూర్పుగోదావరి జిల్లాలో మొదలైన అంబేద్కర్ విగ్రహాల విధ్వంసం ఇప్పుడు రాష్ట్రమంతటికీ పాకింది. కోనసీమలో కుల చిచ్చు రగిల్చి రాజకీయలబ్ధి పొందాలనే కుట్రలో భాగంగానే ఈ విగ్రహ విధ్వంసం జరిగిందనేది చాలా మంది అభిప్రాయం. తాగినమైకంతో కొందరు యువకులు చేసిన ఆకతాయి పని అని మనల్ని నమ్మమంటున్నారు పోలీసులు. ఏది ఏమైతేనేం జరగకూడనిది జరిగింది. అంబేద్కర్ విగ్రహాల విధ్వంసాన్ని అందరూ ముక్తకంఠంతో ఖండించారు. ముఖ్యమంత్రి అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. చంద్రబాబు, జగన్ కూడా అంబెద్కర్ పై తమ భక్తిని చాటారు. అన్ని పార్టీల నాయకులు ఖండఖండాలుగా జరిగిన దాన్ని ఖండించారు. పత్రికా ప్రకటనలతో ఊదరగొట్టారు. “అంబేద్కర్ ఏ ఒక్క కులానికో చెందిన వాడు కాదు. అంబేద్కర్ జాతి నాయకుడు” అని అందరూ ప్రకటనలు గుప్పించారు. అంబేద్కర్ జాతి నాయకుడే అని మనం నమ్ముతుంటే మరి అలాంటి జాతీయ నాయకుడి విగ్రహాలు ఎక్కడున్నాయి? ఏ వాడల్లో ఉన్నాయి?

ఆంధ్రప్రదేశ్ మొత్తం మీద అగ్ర కులాల వాడల్లో అంబేద్కర్ విగ్రహం ఎక్కడైనా ఉందా?

ఆధిపత్యకులాలు ఏర్పాటు చేసుకున్న కాలనీ, నగర్‌లకు ఎక్కడైనా అంబేద్కర్, అనిగాని అంబేద్కర్ కాలనీ అని గాని పేరు పెట్టుకున్న దాఖలాలు ఉన్నాయా?

తమ పిల్లలకి అంబేద్కర్ అని పేరు పెట్టుకున్న అగ్రకులాల వారు ఎవరైనా ఉన్నారా? (గాంధీ, నెహ్రూ, తిలక్, బోస్ లపేర్లు చాలా మంది పెట్టుకున్నారు.) వీటన్నిటిని బట్టి చూస్తే మనకు అర్థమయ్యే విషయం ఏంటంటే మెజార్టీ ప్రజలు అంబేద్కర్ కేవలం దళిత నాయకుడిగా మాత్రమే చూస్తున్నారు. ఎంతోమంది మేధావులు, రాజనీతిజ్ఞులు సభ్యులుగా ఉన్న భారత రాజ్యాంగ ముసాయిదా రచనా సంఘం అధ్యక్షుడిగా అంబేద్కర్ బాధ్యతలు నిర్వర్తించారు. అలాంటి అంబేద్కర్‌ను జాతి నాయకుడిగా ఎందుకు అంగీకరించలేకపోతున్నాం? ఈ ప్రశ్నలకు మనం నిజాయితీగా సమాధానం వెతుక్కోవాలి.

స్వాతంత్ర్యానికి పూర్వం అనేక సంస్థానాలుగా విడిపోయిన భారతదేశం మళ్ళీ ఒక్క దేశంగా నిలబడటానికి, ఎలాంటి అంతర్యుద్ధాలు లేకుండా, అందరి ప్రయోజనాలు కాపాడే రాజ్యవ్యవస్థని నిర్మించడానికి మన రాజ్యాంగం ఒక పునాది వేసింది. ఆ పునాది ఆధారంగానే మనం ఇప్పుడున్న భారతదేశాన్ని నిర్మించుకున్నాం. భావప్రకటనా స్వేచ్ఛ, సార్వజనీన ఓటు హక్కులాంటి అద్భుతమైన హక్కుల్ని ఎలాంటి పోరాటం లేకుండా రాజ్యాంగం ద్వారా పొందగలిగాం. ఇప్పటి తరానికి ఈ హక్కుల విలువ, మన రాజ్యాంగ ఔన్నత్యం అర్థం

కావడం లేదు. అంబేద్కర్ అంటే ఇప్పటి తరానికి రాజ్యాంగం గుర్తుకు రావడం లేదు, రిజర్వేషన్లు గుర్తుకొస్తున్నాయి. రిజర్వేషన్ల కారణంగా తమ ఉద్యోగాలన్నీ దళితులు తన్నుకుపోతున్నారనే రుగ్ధ అంబేద్కర్ పట్ల వ్యతిరేకతంగా మారుతోంది. మనదేశ జనాభా 100 కోట్లతో 2 కోట్లమంది ప్రభుత్వోద్యోగులు ఉన్నారు. దళితులు, ఆదివాసీలు కలిపి రిజర్వేషన్లు, ఓపెన్ కేటగిరీల్లో కలిపి 30% ఉద్యోగాలు పొందారనుకున్నా... దళిత ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య 60 లక్షలకు మించరు. అంటే 25 కోట్ల దళిత, ఆదివాసీ జనాభాలో కేవలం 60 లక్షల మంది ఉద్యోగాలు పొంది ఉంటారు. మరి ఉద్యోగాలన్నీ దళితులే తన్నుకుపోతున్నారని వాపోవడం ఎంతవరకు సమంజసం? తరతరాలుగా అణగదొక్కబడ్డ దళిత సోదరులు పైకి ఎదిగేందుకు ఉన్న ఏకైక మార్గంపై అక్కసు ఎందుకు? అని ప్రశ్నించే అగ్రకుల మేధావుల సంఖ్య తగినంత లేకపోవడం అంబేద్కర్‌పై కొన్ని వర్గాల వ్యతిరేకతకు ఒక కారణమవుతోంది.

మనం ఆత్మగౌరవ ఉద్యమాలు ఊపందుకున్న దశలో ఉన్నాం. ఒక జాతి, ఒక కులం, లేదా ఒక ప్రాంతం ఆత్మగౌరవ పోరాటం చేస్తున్నదంటే దాని అర్థం ఆ జాతి లేదా ఆ కులం లేదా ఆప్రాంతం అభివృద్ధి చెందుతోందని. చదువు, కనీస అవసరాలు తీర్చే సంపాదన, ఖాళీసమయం, అదనపు వనరులు ఉన్నప్పుడు ఆత్మగౌరవం గురించిన ఆలోచన మొదలవుతుంది. ఇవేమీ లేనప్పుడు ఆకలిపోరాటం మాత్రమే ఉంటుంది. ఇప్పుడు దళితుల పరిస్థితి 1947తో పోల్చుకుంటే ఎన్నో రెట్లు మెరుగయిందన్నది తిరుగులేని వాస్తవం. రిజర్వేషన్లు, అక్షరాస్యత పెరగడం, ఎనిమిది గంటల పని విధానం, ఓటుహక్కు, వీటన్నిటి కారణంగా దళితుల జీవితాలు మెరుగయ్యాయి. విద్యావంతులైన దళితులు గతంలో తమకు జరిగిన అన్యాయం, తమ పూర్వీకులు అనుభవించిన అమానవీయ అణచివేతల గురించి ప్రశ్నించడం మొదలుపెట్టారు. ఈ ప్రశ్నించేధోరణి సునిశితంగా, సున్నితం గాకాక దూకుడుగా, మొరటుగా ఉంటున్నదనేది కొందరి అభిప్రాయం. చరిత్ర నుండి మనం పాఠాలు నేర్చుకుని భవిస్యత్తును నిర్మించుకోగలం, అంతేగాని గతాన్ని సరిచేయలేం. ఈ స్పృహతో దళిత మేధావులు వ్యవహరించవలసి ఉంది. ఇంకా సూటిగా చెప్పాలంటే జరిగిన దాని గురించిన వర్ణన కంటే జరగాల్సిన దాని గురించి, సాధించుకోవాల్సిన దాన్ని గురించి ఎక్కువ చర్చ జరగాలి. ఉదాహరణకి శ్రీ రాముడిని తీవ్రంగా విమర్శించడం వల్ల దళిత మేధావుల పట్ల హిందూ అగ్ర వర్ణాల వారికి వ్యతిరేకత వస్తోంది తప్ప దళితులకు ఒరిగేదేమీ ఉండదు. రాముడిని పూజించే హిందువులు ఎవరూ ఇప్పుడు రాముడు సీతని విడిచిపెట్టడాన్ని సమర్థించరు, అనుసరించరు. అలాగే కృష్ణుడిని పూజించే వారందరూ ఆయన చెప్పాడు కాబట్టి కులాలు ఉండాల్సిందే అని అనరు. కాబట్టి గతాన్ని తీవ్రంగా, పరుషంగా విమర్శించడం కన్నా, భవిష్యత్తులో దేశంలోని అన్ని కులాల వారు సమిష్టిగా ఎదిగేందుకు అవసరమైన రాజ్యవ్యవస్థ నిర్మాణం కోసం దళిత మేధావులు కృషి చేయాల్సి ఉంది. ఇలాంటి కృషి మన సమాజంలో చాలా తక్కువగా ఉండటం విగ్రహాల విధ్వంసానికి మరొక కారణం.

మరోవైపు జాతినాయకుల్ని కులాల వారీగా పంచుకునే ఓ దుస్సాంప్రదాయం ఈ మధ్య బాగా పెరుగుతోంది. ప్రతి కులం తమ కులంలో గొప్ప గొప్పవారు జన్మించారని చెప్పుకోవడం కోసం జాతినాయకుల్ని కులవైభవ ప్రతికలుగా మార్చుకోవడం మొదలుపెట్టారు. మహాత్మగాంధీని వైశ్యులు, నెహ్రూని బ్రహ్మణులు, అంబేద్కర్‌ని మాలలు, మహాత్మ జ్యోతిబాపూలేని బిసిలు, అల్లూరిని క్షత్రియులు, యోగివేమనను రెడ్లు, కృష్ణదేవరాయులను కాపులు, తాండ్రపాపారాయుడిని వెలమలు, రాణిరుద్రమదేవిని కమ్మలు, ఇలా జాతి రత్నాల్లాంటి నాయకులు, మహాపురుషులు, యోధులను కులాల వారీగా పంచుకోవడం అనే దౌర్భాగ్యస్థితి మనకు దాపురించింది. సమున్నత మన దేశ వారసత్వాన్ని కులాల ప్రతీకలుగా మార్చుకోవడం మంచిదికాదు. జాతి నాయకుల్ని కులనాయకులుగా మార్చుకుంటూ మనం మన జాతిని నాయకులులేని జాతిగా మార్చుకుంటున్నాం. మన దేశాన్ని ఒక్కతాటిపై నడిపించిన, భవిష్యత్తుతరాలకు స్ఫూర్తినివ్వగల మేరునగ ధీరులైన నాయకుల్ని కులాల కుత్సిత బుద్ధితో మరుగుజ్జులుగా మార్చుకుంటున్నాం. మన దివాళకోరు రాజకీయాల కారణంగా దేశం మొత్తం గౌరవించే నాయకులు మనకి ఉన్న కొద్దిమంది. చారిత్రక పురుషుల్ని కూడా ఇలా రొంపిలోకి లాగి భవిష్యత్తు తరాలకు ఆదర్శపురుషులు లేకుండా చేసుకుంటున్నాం. ఇది ఎంత మాత్రం మంచిదికాదు. ❑

# ప్రజాస్వామ్యం దిశగా మయన్మార్

దీర్ఘకాలంగా సైనిక పాలనతో, అంతర్జాతీయ ఆంక్షలతో నలిగిపోతున్న మయన్మార్ (బర్మా) ప్రజాజీవితం ప్రజాస్వామ్యం దిశగా అడుగువేస్తోంది. థన్‌సియిన్ అధ్యక్షునిగా సైనిక నేతృత్వంలో సాగుతున్న పౌరప్రభుత్వం ప్రజా నాయకురాలు ఆంగ్‌సాన్ సూకీని గృహ నిర్భంధం నుండి విడుదల చేసి పరివర్తనా సంకేతమిచ్చింది. ఐదారేళ్లనాడు ప్రకటించబడిన నోబెల్ శాంతి బహుమతిని ఇటీవల ఆమె స్వీక రించారు. తన మయ న్మార్‌లో రాజకీయ స్వేచ్ఛల పునరుద్ధరణకిది స్పష్టమైన సంకేతం.

**ఏప్రిల్‌లో పార్లమెంటుకు ఉపఎన్నికలు పోటికి సిద్దమోతున్న అంగ్‌సాన్ సూకీ**

2012 ఏప్రిల్ జరగనున్న ఉప ఎన్నికలలో సూకీ పార్టీ పోటికి సన్నాహాలు చేస్తున్నది.



శాంతియుతంగా నిరసన తెలియజేసే హక్కును ప్రజలకు కల్పిస్తూ సైనిక ఆధిపత్యంలోని పార్లమెంటు ఒక బిల్లును ఆమోదించటం ఈ దిశలో మరో ముందడుగు. ప్రదర్శన జరపదలుచుకున్న వారు ఐదురోజులు ముందుగా అధికారులకు తెలియజేయాలని, పార్టీ జెండాలు, చిహ్నాలు ధరించవచ్చునని, ప్రభుత్వ భవనాలు, స్కూళ్లు, ఆసుపత్రులు, రాయబార కార్యాలయాల మార్గాల్లో మాత్రం వెళ్ళకూడదని ఆ బిల్లు నిర్దేశించింది. నాలుగేళ్ల క్రితం బౌద్ధ సన్యాసుల ప్రదర్శనపై సైన్యం విరుచుకుపడటం, కాల్పుల్లో 31 మంది చనిపోయిన ఘోరకలితో పోల్చుకుంటే ఈ బిల్లు పౌర స్వేచ్ఛలపట్ల స్పష్టమైన పురోగతి, సూచిస్తోంది. నాడు వందల మంది సన్యాసులు గాయపడ్డారు. ఇప్పటికి అనేక మంది జైల్లో వున్నారు. ఆంగ్‌సాన్ సూకీతో నేరుగా సంభాషణలు, ఒక వివదాస్పదమైన ఆనకట్ట నిర్మాణం నిలుపుదల, కార్మికులకు సమ్మె హక్కు కల్పిస్తూ చట్టాన్ని ఆమె రాజ్యాంగం రూపకల్పనను చేపట్టాలని, ప్రజాస్వామ్య ఎన్నికల ద్వారా ప్రజా ప్రాతినిధ్య ప్రభుత్వాన్ని ఏర్పరుచుకోవాలని, అంతర్జాతీయ సమాజంలో భాగస్వామి కావాలని ఆశించుదాం.

## ప్రథమం నుంచి అథమానికి....

మయన్మార్ ఒకప్పుడు బర్మా, దాని రాజధాని అప్పట్లో రంగూన్. ఒకప్పుడు బర్మా ఆగ్నేయాసియా దేశాల్లో అభివృద్ధిలో రెండో స్థానంలో ఉంది. అన్ని రంగాలలోనూ చాలా అభివృద్ధి చెందిన దేశం. విస్తారమైన వనరులు, ఖనిజ సంపద దానికి అదనపు బలాలు. ధాన్యం ఎగుమతిలో ప్రపంచంలోనే ప్రథమస్థానంలో ఉండేదంటే మనం ఇప్పుడు నమ్మగలమా? బర్మా టేకు ప్రపంచంలోనే అత్యంత ప్రసిద్ధి పొందింది. ప్రపంచంలో 75శాతం నాణ్యమైన టేకు బర్మాలోనే ఉత్పత్తయ్యేదన్న విషయం కూడా నమ్మలేని నిజం. వీటన్నిటినీ మించి అక్షరాస్యతలో కూడా బర్మా ఆగ్నేయాసియా దేశాలలో బాగా ముందుండేది. 1936లో బ్రిటిషిండియా నుంచి బర్మాను వేరు చేశారు. రెండో ప్రపంచయుద్ధ కాలంలో జపాన్ ఆక్రమణలోకి వెళ్లిన బర్మా 1948 జనవరి 4న రిపబ్లిక్‌గా అవతరించింది. దశాబ్దంన్నర గడిచేసరికి ఆ ముచ్చట ముగిసిపోయింది. 1962లో ప్రభుత్వాన్ని కుట్రతో కూలదోసి సైనిక నియంతలు అధికారంలోకొచ్చారు. జనరల్ నెవిన్ నాయకత్వంలో బర్మా అభివృద్ధిలో బాగా వెనుకబడి ఉంది. 1987లో ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన ప్రపంచ దేశాల అభివృద్ధి నివేదికలో మయన్మార్ చిట్టచివరి స్థానాన్ని ఆక్రమించింది. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ అంచనాల ప్రకారం 2007 నాటికి అవినీతిలో ప్రథమస్థానంలో నిలిచింది. నిరంతరం అంతర్యుద్ధ అగ్ని కిలల్లో మండిపోతున్న సొమాలియాతో కలసి అవినీతిలో అగ్రస్థానాన్ని అది పంచుకుంది. ❑

# శ్రీ వరిసాగుకే ఉపాధి సాయం

జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ఏప్రిల్ 1నుంచి వ్యవసాయంతో అనుసంధానం చేస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ ప్రకటించింది. ఒక్క శ్రీ వరి సాగుకు తప్ప మిగతా ఏ పంటలనూ జాతీయ ఉపాధి హామీ కింద చేర్చలేదు. సాయమంతా వ్యవసాయ అనుబంధరంగాలకే పరిమితమవుతోంది. మిహిర్‌షా నివేదికననుసరించి.

■ కోళ్లు, మేకలకు అవసరమైన షెడ్లను ఉపాధి నిధులతో నిర్మించుకోవచ్చు. ఒక్కో గ్రామ పంచాయతీలో ఏడాదికి ఐదు కుటుంబాల చొప్పున మాత్రమే ఇందుకు అనుమతి. కోళ్ల షెడ్‌కు రూ॥40 వేలు, మేకల షెడ్‌కు రూ॥35 వేలుగా గరిష్ఠ ధర నిర్ణయించారు.

■ పశువుల దాణాగా ఉపయోగించే అజోల్ల శిలీంధ్రం ఉత్పత్తికి సాయం. ఒక్కో తొట్టె ఏర్పాటుకు రూ॥2 వేలు.

■ కోస్తా ప్రాంతంలో మత్స్యకారులు చేపలను ఎండబెట్టుకునే యార్డులను నిర్మించుకోవడానికి యార్డుకు రూ॥75 వేలు సముద్ర తీరం వెంబడి భూమి కోతకు గురి కాకుండా ఉండేందుకు మాంగ్రూవ్, సర్వి,తాటి చెల్ల వంటివి పెంచుకోవడానికి సాయం. ఒక్కో మొక్కకు రూ॥17.

■ కోస్తా ప్రాంతం వ్యవసాయ సాగులో మురుగు పారుదల వ్యవస్థ ముఖ్యమైనది. ఈ వ్యవస్థ సరిగా లేక వేలాది ఎకరాలు ముంపునకు గురై పంట నష్టపోతోంది. మురుగునీటికి డ్రెయిన్లను నిర్మించేందుకు ఉపాధి సాయం కింద అనుమతి ఒక్కో డ్రెయిన్ నిర్మాణానికి రూ॥2.30 లక్షల వరకు కేటాయింపు.

■ కాంటూరు కందకాలు, మట్టి కట్టలు, వర్షపునీటి నిల్వ గుంతల నిర్మాణానికి, వర్మి కంపోస్టు తయారీకి బయోగ్యాస్ ప్లాంట్ల నిర్మాణానికి అవకాశం.

■ భూగర్భ జలాల పెంపు, ఇంకుడు గుంతలకూ ఉపాధి నిధులు.

■ వ్యక్తిగత మరుగుదొడ్లు, అంగన్‌వాడి కేంద్రాలు, పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం, చెత్త నిర్వహనకు ఉపాధి నిధులు వాడుకునే అవకాశం.

## శ్రీవారి సాగుకే ఎందుకు?

భవిష్యత్తులో తీసుకురాబోతున్న ఆహారభద్రత చట్టానికి లోటులేకుండా చూసుకోవడానికే శ్రీవారిసాగును జాతీయ ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇప్పుడున్న సంప్రదాయ వరిసాగు కారణంగా ఒకవైపు నానాటికీ భూసారం తగ్గుతుండటంతోపాటు మరోవైపు అత్యంత విలువైన జలవినియోగం పెరుగుతోంది. దిగుబడులు పెరగడం లేదు. శ్రీసాగు విధానంవల్ల 30 శాతం నీటి వినియోగం తగ్గి అంతేమొత్తంలో దిగుబడి పెరుగు తుందన్నది మిహిర్‌షా కమిటీ అభిప్రాయం. 75 శాతం విత్తనం పొదుపు కావడంతోపాటు అదే నిష్పత్తిలో భూమి నాణ్యత పెరుగు తుందనే విశ్వాసాన్ని కమిటీ వ్యక్తం చేసింది.

■ ఏకకాలంలో నాట్లకోసం ఏకరాలకు 8 వ్యక్తిగత పని దినాలు. నాట్లు వేసిన 10-15 రోజుల తర్వాత కలుపుమొక్కల నిర్మూలనకు ఎవరాకు 2 వ్యక్తిగత పనిదినాలు. 20130 రోజుల తర్వాత కలుపునిర్మూలనకు ఎకరాకు 2 వ్యక్తిగత పనిదినాలు. శ్రీవారికి ఉపాధి నిధులు వాడుకునే అవకాశం ఐదేళ్లు అయితే ఒక్కోరైతుకు గరిష్ఠంగా మూడేళ్లపాటే సాయం.❑



# ఐక్యకార్యాచరణ కమిటి రిలేనిరాహారదీక్షలు



**నంద్యాల :** నంద్యాల మున్సిపాలిటి పరిధిలో విపరీతంగా పెంచిన ఆస్థిపన్నుకు వ్యతిరేకంగా అఖిల పక్షలాతో కలిసి రిలేనిరాహారదీక్షలు ఫిబ్రవరి 13, 2012 నుండి ఫిబ్రవరి17తేది వరకు జరిగాయి. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా, సి.పి.యమ్, సి.పి.ఐ, భారతీయ జనతాపార్టీ, వై.యస్.ఆర్.కాంగ్రెస్, తెలుగుదేశం, ప్రజాసంఘాలు, కులసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థిసంఘాలు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీకి చెందిన డా॥ శేశారెడ్డి, యం.వి.సత్యనారాయణ్, నిరాహారదీక్షలో పాల్గొన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి యస్.ఎ.మజీద్ గారు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎన్.ఎ.హమద్, జి.వెంగలరెడ్డి, రమణ, పి.ఎన్.కృష్ణ, యువసత్తా నాయకులు డా॥రాముడు, నారాయణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆలోచించండి

**నంద్యాల :** లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో వార్డు పర్యటన చేసి, ప్రజలకు నిజమైన రాజకీయాలను గురించి అవగాహన, ఆలోచన దిశలో ఓటర్లకు కార్యకర్తలు నాయకులు వివరించారు. మున్సిపాలిటి వారు కాలువలు శుభ్రత, చెత్త చెదారం, వార్డులో పేరుకు పోయిన విధానంపై ప్రజలకు అవగాహన కల్పించి, వివరించి, మంచి పార్టీకి ఓట్లువేసి మంచి నాయకులను ఎన్నుకోవలసినదిగా ప్రభావితం చేయడమైంది. లోక్‌సత్తా పార్టీని ఆశీర్వదించండి, ఆసక్తి ఉంటే ఈ పార్టీలో సభ్యులుగా నేడే చేరండి, పార్టీని బలోపేతం చేయండి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా నియోజకవర్గ ఇన్‌ఛార్జ యస్.ఎ.మజీద్ పట్టణ అధ్యక్షులు ఎన్.ఎ.హమద్, ప్రధాన కార్యదర్శి ఎమ్.వి.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు పి.ఎన్.కృష్ణ,

## అనంతపురం జిల్లా



సెక్రటరి ప్రభాకర్ గౌరవ సలహదారులు డా॥శేశారెడ్డి డా॥రాముడు, యువసత్తా నాయకులు, విజయ్, ఇక్బాల్, ఫరూబ్, ఖలీల్, రఫి, జిలాని తదితరులు పాల్గొన్నారు.




### పాదయాత్రకు మద్దతుగా ర్యాలీ

**రాయదుర్గం :** లోక్‌సత్తా పార్టీ అధ్యక్షులు జయప్రకాష్‌నారాయణ్ ఆధ్వర్యంలో చేపడుతున్న పాదయాత్రకు మద్దతుగా రాయదుర్గం లోక్‌సత్తా పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. తాలూకా అధ్యక్షులు బాబు అధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ చేపట్టారు. రైతులకు మద్దతుగా జేపీ చేపడుతున్న యాత్రకు రాయదుర్గం నియోజకవర్గం నుంచి భారీగా వాహనాల్లో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో వెంకటలక్ష్మీ రాఘవేంద్ర, రియాజ్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున నినాదాలు చేసుకుంటూ, వాహనాల్లో జేపీ పాదయాత్ర చేపడుతున్న ఎమ్మిగనూరు ప్రాంతానికి తరలివెళ్ళారు.

# ఎన్నికల వాయిదా రాజ్యాంగ ఉల్లంఘనే



**ఏడురోడ్ల జంక్షన్ :** రాజకీయ నాయకులు, వ్యక్తిగత ప్రయోజనాల కోసం మున్సిపల్ ఎన్నికలను వాయిదా వేయడం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని తెలుగుదేశం పార్టీ నాయకుడు గుండ అప్పలసూర్యనారాయణ అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.పోలీనాయుడు అధ్యక్షతన మున్సిపల్ ఎన్నికల వాయిదాను నిరసిస్తూ వివిధ రాజకీయ పార్టీలు, మేధావులు, స్వచ్ఛందసంస్థ ప్రతినిధులతో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. పోరాటాల స్ఫూర్తితో ప్రజాస్వామ్య పద్ధతిలో సాధించుకున్న 73,74 రాజ్యాంగ సవరణల స్ఫూర్తికి విఘాతం కలిగిస్తూ రాజ్యాంగాన్ని ఒక పథకం ప్రకారం అధికార పార్టీలు నిర్వీర్యం చేయడం క్షమార్హం కాదని సీపీఐ నాయకుడు చాపర సుందరలాల్ అన్నారు. దేశంలో కేవలం కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో మాత్రమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్ణీత గడువులోగ జరపడం లేదన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పూడి తిరుపతి రావు మాట్లాడుతూ ఎన్నికలను వాయిదా ప్రభుత్వ పనితీరుకు అద్దంపడుతోందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బవిరి కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం అన్నింటా వైఫల్యం చెందిందన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ యువజన విభాగం ప్రతినిధి హనుమంతు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ కఠినంగా అమలు జరిగేలా చట్టంలో మార్పుతేవాలన్నారు. సిటిజన్ ఫోరం అధ్యక్షుడు బి.కామేశ్వరరావు ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని పాలన పూర్తిగా గాడితప్పిందన్నారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఎన్.అప్పన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అంధవరపు సూరిబాబు, రౌతు సీతారామస్వామి లోక్‌సత్తా ప్రతినిధులు ఫల్గుణరావు, యువసత్తా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచాది రాంబాబు పాల్గొన్నారు.

## శ్రీకాకుళం జిల్లా



### మాటలు రైతులకు...మూటలు దళారులకు...!

**రామలక్ష్మణకూడలి :** తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న రైతన్నలకు ఈ ప్రభుత్వం చెప్పే మాటలు మిగులుతుంటే దళారులకు మాత్రం మూటలు అందుతున్నాయని పట్టణంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు మండిపడ్డారు. స్థానిక లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల జిల్లా నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు కె.పోలినాయుడు మాట్లాడుతూ రైతులే ప్రభుత్వమని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎక్కడా లేని విధంగా ఇతర రాష్ట్రాల్లో అమ్ముకోవడాన్ని నియంత్రిస్తూ రైతుల పాలిట శాపంలా పాలకులు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. రైతుల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఉన్న ఈ ఆంక్షలను ఎత్తివేయకుంటే. ప్రభుత్వం తగు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. తెదేపా జిల్లా అధ్యక్షులు చౌదరి నారాయణమూర్తి (బాబ్జీ) మాట్లాడుతూ రైతుల్లో ఉన్న అనైక్యతను అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని దళారులకు లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం రైతుల్ని ఇబ్బంది పెట్టడం క్షమించరాని నేరమన్నారు. తక్షణం ఆంక్షలు ఎత్తి వేయాలని, లేకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. భాజపా జిల్లా అధ్యక్షులు

టంకాల దుర్గారావు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా పార్టీలన్నీ అన్నదాతను ఆదుకొనేందుకు సమైక్యంగా ఉద్యమించాలన్నారు. ఈ ప్రభుత్వం రైతులను నాశనం చేయడమే లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. సమావేశంలో యువసత్తా రాష్ట్ర ఉపాధ్యక్షులు పంచాది రాంబాబు, లోక్‌సత్తా నాయకులు బి.జగదీష్, వి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖపట్నం జిల్లా

### లోక్‌సత్తా విజయోత్సవ ర్యాలీ

**విశాఖపట్నం :** లోక్‌సత్తా పార్టీ అధినేత జయప్రకాష్ నారాయణ్ చేపట్టిన రైతు సత్యాగ్రహ పాదయాత్ర విజయవంతం కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆ పార్టీ నగర కమిటీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించింది. జీవిఎంసీ గాంధీ విగ్రహం నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ విగ్రహం సర్కిల్ మీదుగా తిరిగి జీవీఎంసీ వరకు కొనసాగింది. అక్కడ రైతు వ్యతిరేక ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేసిన నాయకులు భారీగా బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా నగర కమిటీ అధ్యక్షుడు కేవీ సురేష్‌కుమార్ మాట్లాడుతూ రైతు వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ పాదయాత్ర చేపట్టిన జయప్రకాష్ నారాయణ్ కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నుంచి కర్నాటక సరిహద్దు దాటి అక్కడ ధాన్యం విక్రయించారన్నారు. ఇది రాష్ట్ర రైతుల విజయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రామ్‌శశిధర్, జోయ్, గోవర్ధన్, కిశోర్, రవికిరణ్, ప్రసాద్, కేఎస్‌బాబు, అశోక్, సందీప్, పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలు జిల్లా

### పి.హెచ్.సి సిబ్బంది తీరుపై ఫిర్యాదు

**పెద్దకడబూరు :** మండలకేంద్రాలలో పిహెచ్‌సిలను స్థాపించి రోగులకు సేవలు అందించాలన్న ప్రభుత్వ నిర్ణయాలను పెద్దకడుబూరు పిహెచ్‌సిలోని సిబ్బంది ఖాతరు చేయడం లేదని లోక్‌సత్తా మండల అధ్యక్షులు సుబ్రమణ్యశర్మ, కార్యదర్శి భీమన్న మరియు గ్రామస్థులు హనుమంతాచారి, ఉరుకుందప్ప, నాగరాజు, కొంతమంది రోగులు ఎమ్మార్వో నాగయ్యకు ఫిర్యాదు చేశారు. ఉదయం 8.30 నిమిషాలకే కల్లుకుంట గ్రామానికి చెందిన అక్తరుబీకి, పెద్దకడుబూరుకు చెందిన మూకమ్మ అనే వృద్ధురాలికి వాంతులు, విరోచనాలు సంభవించి సర్కారు దవాఖానాకు చేరితే అక్కడున్న ఆర్‌సిహెచ్ సిబ్బంది ఒకరు గ్లూకోజ్ బాటిల్స్ ఇచ్చి లీక్‌పెట్టి వెళ్ళినట్లు వారు తెలిపారు. ఇక్కడ పనిచేసే ఓపిఎఎన్‌ఎం 8 గంటలకు విధులకు హాజరుకావాల్సి ఉండగా 11.45 నిమిషాలకు పిహెచ్‌సికి వచ్చిందని, అప్పటికే రోగులు ఒపిఏఎన్‌ఎం ఆలస్యంగా రావడంపై నిలదీసినట్లు దీంతో క్రోపోక్తులైన ఒపిఎఎన్‌ఎం రోగులను నోటికి వచ్చినట్లు మాట్లాడినట్లు వారు ఎమ్మార్వోకు ఇచ్చిన ఫిర్యాదులో విన్నవించుకొన్నారు. అంతటితో రోగులకు వైద్యం చేయకుండా వెంటనే అందరూ చూస్తుండగానే సెలవుచీటిరాసి రిజిష్టర్‌లో ఉంచి ఆటోలో ఎమ్మిగనూరు ప్రయాణమై పోయినట్లు రోగులు, లోక్‌సత్తా సభ్యులు వెల్లడించారు.

వాంతులు, విరోచనాలతో బాటిల్స్ ఇచ్చిన అక్తరుబీ, మూకమ్మలకు ఇంజక్షన్ వేసేవారు కూడా లేకపోవడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారిందని, బసలదొడ్డి, చిన్నకడుబూరు మిగిలిన సుదూర ప్రాంతాల నుండి వచ్చిన రోగులకు వైద్యం అందకపోయేసరికి పిహెచ్‌సికి తాళం వేసి తాళాన్ని ఎమ్మార్వో నాగయ్యకు అందజేసి పరిస్థితిని వివరించారు. ఇక్కడపనిచేసే డాక్టరు, వారంలో రెండుమూడుసారు మాత్రం మొక్కుబడిగా వస్తారిని, మిగిలిన సిబ్బంది సెలవులు పెట్టి వెళితే సామాన్యులు పరిస్థితి ఏమిటని వారు ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారులు స్పందించి సక్రమంగా పనిచేయని వైద్యసిబ్బందిపై చర్యలు తీసుకొని సామాన్యులకు వైద్యసేవలందేనా చూడాలని సుబ్రమణ్యశర్మ, భీమన్న, ఉరుకుందప్ప, నాగరాజు, గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు.

### రేషన్‌కార్డుల జారీపై గందరగోళం

**అధికారులను నిలదీసిన నాయకులు**

**అదనంగా డబ్బు వసూలు**

**పెద్దకడబూరు :** రేషన్ కార్డుల జారీకి నిబంధనలకు విరుద్ధంగా ప్రజల నుండి అధికంగా డబ్బు వసూళ్లు చేస్తున్నారంటూ తెలుగుదేశం, సిపియం పార్టీలతో పాటు లోక్‌సత్తా నాయకులు

ఉదయం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న డిపియల్ కేంద్రం వద్దకు చేరుకొని డిప్యూటీ ఎంఆర్ఓ హనుమంతప్పతో వాగ్వివాదానికి దిగారు. నిబంధనల మేరకు ప్రజల నుండి కార్డుజారీకి డబ్బు వసూళ్లు చేయాల్సిఉండగా అదనంగా ఏలా వసూళ్లు చేస్తున్నారని నిలదీశారు. కార్డుల కోసం ప్రజల నుండి వసూళ్లు చేయాల్సిన డబ్బుకు సంబంధించిన ఉత్తర్వులను చూపాలని డిమాండ్ చేశారు. ఒక దశలో అధికారుల తీరుపై మండిపడుతూ సవాళ్లు విసిరారు. ఈ కారణంగా అక్కడ కొంత ఉద్రిక్తత పరిస్థితులకు దారితీసింది. దీంతో కార్డుల జారీ ప్రక్రియకు కొద్దిసేపు అంతరాయం కలిగింది. అనంతరం వారు ఎంఆర్ఓ రామన్నను ఇదే విషయమై నిలదీశారు. అయితే ఇందుకు ఎంఆర్ఓ సమాధానం ఇస్తూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక్కొక్క కార్డుకు రూ.40 లు మాత్రం వసూళ్లు చేస్తున్నామని అంతకుమించి వసూళ్లు చేయడం లేదని పేర్కొన్నారు. వసూళ్ళు చేసిన డబ్బుకు సంబంధించి ప్రజలకు రసీదును సైతం ఇస్తున్నామని వివరించారు. అయినా ఇందుకు వారు సంతృప్తి చెందక నిబంధనల ఉత్తర్వు చూపాలని పట్టుబట్టగా, అలాంటి ఉత్తర్వులు ఏమి తమకు రాలేదని ఎంఆర్ఓ చెప్పడంతో అసంతృప్తిని వ్యక్తం చేస్తూ అక్కడి నుండి వారు వెళ్లిపోయారు. ఈ నిరసన కార్యక్రమంలో లోక్‌సత్తా మండల కన్వీనర్ సుబ్రమణ్యం శర్మ, పార్టీ కార్యకర్తలు, తెలుగుదేశం నాయకులు జెడ్‌పిటిసి సభ్యులు బి. హనుమంతరెడ్డి, టిడిపి ఎస్‌సి సెల్ జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్, సిపియం నాయకులు తిక్కన్న, రైతుసంఘం జిల్లాకార్యవర్గ సభ్యులు పరమేష్ తదితరులు పాల్గొన్నారు.




## లోక్‌సత్తా పార్టీ ప్రచురణలు

1. శాసనసభ ప్రసంగాలు (2009-11)
   డా॥ జయప్రకాష్ నారాయణ్ — రూ 100/-
2. మన ప్రజాస్వామ్యం సంక్షోభం - పరిష్కారాలు
   డా॥ జయప్రకాష్ నారాయణ్ — రూ 50/-
3 స్వరాజ్యం (ప్రజాహక్కుల పత్రం) — రూ 50/-
4. నూతన రాజకీయ సంస్కృతి — రూ 10/-
   డి.వి.వి.యస్. వర్మ
5. జన రాజకీయం
   డి.వి.వి.యస్. వర్మ — రూ 10/-
6. లోక్‌సత్తా పార్టీ @ 5 — రూ 10/-
   (ఐదేళ్ళ లోక్‌సత్తా పార్టీ ప్రస్థానం)
7. కూకట్‌పల్లిలో నిజమైన అభివృద్ధి — రూ 10/-
8. రైతు వేదికల మార్గదర్శి — రూ 10/-
9. లోక్‌పాల్ ఎలా సాధించుకుందాం? — రూ 5/-
10. మున్సిపాలిటీలు ఆస్తిపన్ను — రూ 2/-
11. మీడియా రిలీజ్‌లు 2010 — రూ 200/-

**ప్రతులకు :**

**లోక్‌సత్తా పార్టీ కార్యాలయం**

లోక్‌సత్తా పార్టీ - హైదరాబాద్ పేరుమీద చెక్కులు, డ్రాఫ్టులు ఈక్రింది అడ్రస్‌కి పంపండి
మీ పోస్టల్ చిరునామా తెలియజేయండి.

# రైతు సత్యాగ్రహ యాత్ర దృశ్యాలు



















RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2010-12



ఎల్లారెడ్డి నుండి ఎస్గి (మహారాష్ట్ర)

# రైతు మహా సత్యాగ్రహ యాత్రలో జేపీ

To,

Book-Post
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
8-2-674B/2/9, Plot No. 93
Happy valley, Road No. 13A
Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad